Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 12.12.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# సీమాంధ్రకు సింగపూర్ సోకు!

ప్రపంచానికే విజ్ఞానాన్ని అందించింది భారతదేశం. నాగరికత పుట్టింది ఇక్కడే! మానవ జీవితం వికాసం చెందింది ఇక్కడే! ధర్మం, అధర్మం, నీతి, నిజాయితీ అన్నీ ఇక్కడే ఉన్నాయి. మానవవనరులు మన దగ్గరున్నాయి. అద్భుతమైన మేధస్సు వుంది. ఈరోజు ఇతర దేశాలకు పోయి మన ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ప్రాజెక్టులు కడుతున్నారు. అద్భుతమైన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. విదేశాలలో ఎయిర్‌పోర్టులను సైతం మన దేశానికి చెందిన సంస్థలు నిర్మిస్తున్నాయి. టెక్నాలజీ పరంగా ఈరోజు దేశం ఎంతో ముందుంది. సాంకేతిక డిజైన్‌లకు, మాస్టర్ ప్లాన్‌లకు మనం ఇంకో దేశం మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. అవకాశమిస్తే దేశీయ కంపెనీలే ఎన్నో అద్భుతమైన మాస్టర్‌ప్లాన్‌లను తయారు చేసివ్వగలవు.



**రాజధాని మాస్టర్‌ప్లాన్‌పై కుదిరిన ఒప్పందం**

**ఎంత చెల్లించేది రహస్యమే**

**గుంటూరు-కృష్ణ జిల్లాలలో సింగపూర్ బృందం సర్వే**

కాని మన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రం సింగపూర్ అలా మైండ్‌లో నిలిచిపోయింది. సింగపూర్ వంటి రాజధాని ఆయన స్వప్నంగా మారిపోయింది. రాజధాని నిర్మాణానికంటూ స్పెషల్ ఫ్లైట్ వేసుకుని సింగపూర్ తిరిగొచ్చాడు. రాజధానికి మాస్టర్‌ప్లాన్ ఇవ్వాలంటూ వాళ్లను కోరాడు. కాగితం మీద అక్షరం ముక్క రాయడానికి కూడా డబ్బులు తీసుకునే రకం సింగపూర్ వాళ్లు. రాజధానికి మాస్టర్‌ప్లాన్‌ను ఫ్రీగా గీసిస్తారా? రాజధాని మాస్టర్‌ప్లాన్ కోసమే 1200కోట్లు అడిగారు. మరి మన ప్రభుత్వానికి సింగపూర్‌కు మధ్య ఎంత బేరం కుదిరిందో బయటకు రాలేదుగాని మొత్తానికి సింగపూర్ నుండి నిపుణుల బృందం రావడం, మంత్రి పి.నారాయణతో కలిసి వారు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రాజధాని ప్రతిపాదిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించడం జరిగింది. మన రాష్ట్ర రాజధాని నిర్మాణానికి ఇక వాళ్లు డిజైన్ ఇవ్వడమే మిగిలివుంది. చంద్రబాబుకు ఈ (మిగతా 10వ పేజీలో)

# మన నగరం... మహా మురికికూపం

*కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర పురపాలక శాఖామాత్యులు పి.నారాయణ ఇద్దరూ నెల్లూరీయులే! పట్టణాభివృద్ధిశాఖకు చెందిన ఈ మంత్రులిద్దరూ నెల్లూరోళ్లే కాబట్టి నెల్లూరు నగరం ఎంతో అందంగా ఉండి ఉంటుందని అందరూ ఊహించొచ్చు. కానీ , నెల్లూరు నగరం ఎంతటి మురికికూపంగా ఉందో, ప్రజలు ఎంతటి అవస్థలు పడుతున్నారో ఆ దేవుడుకే తెలుసు.*







నెల్లూరు నగరం.. మరోసారి ప్రజలకు నరకం చూపించింది. వానొస్తే చాలు.. నగరమెంత అధ్వాన్నంగా వుంటుందో రుచి చూపించింది. రోడ్లన్నీ మురికికాలువలు కాగా, నగరమే ఒక బురదగుంటగా అవతారమెత్తింది. ఎక్కడ చూసినా దుర్గంధభూయిష్టమే.. కాలు పెడితే చాలు.. సర్రున లాగే మురికి కూపాలు.. ఎక్కడ చూసినా మురుగు మడుగులు. వాహనాల రాకపోకలతో ఎప్పుడూ రద్దీగా వుండే మాగుంట లేఅవుట్ జలదిగ్బంధలో చిక్కుకుపోయింది. (మిగతా 10వ పేజీలో)



## విస్తరణ జరిగితే...

# సోమిరెడ్డికి ఛాన్స్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు కేబినెట్‌లో చాలామంది కొత్తవారికి అవకాశం కల్పించారు. ఈ క్రమంలో చాలామంది సీనియర్లను పక్కన పెట్టారు. కొంతమంది సీనియర్ నాయకులు ఓడిపోవడంతో అసలు వారికి మంత్రి పదవులు ఇవ్వాల్సిన అవసరమే లేకుండా పోయింది. కేబినెట్ మీద పూర్తిగా కొత్తముద్ర వేశారు. కోడెల శివప్రసాద్ వంటి కొమ్ములు తిరిగిన నాయకుడికి కూడా మంత్రి పదవి ఇవ్వకుండా స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. కె.ఇ.కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వంటివారు తప్పితే రెండోసారి మంత్రులైన వాళ్లెవరూ లేరు. మంత్రి పదవులకు అందరూ కొత్తే!

పరిపాలనలో ఈ అనుభవ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏ మంత్రికీ తన శాఖపై పట్టులేకుండా పోయింది. కనీసం తమ శాఖ ద్వారా ప్రజల్లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం కూడా చేయలేకపోతున్నారు. అదీగాక (మిగతా 10వ పేజీలో)



# పట్టుదలతో ఉన్నత శిఖరాలను అందుకోవాలి

## - విద్యార్థులతో డిఆర్‌డిఎల్ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి

ప్రతి విద్యార్థి ఎంతో పట్టుదలతో చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అందుకునేందుకు తమ కలలను సాకారం చేసుకోవాలని భారత రక్షణ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకుంటూ, శాస్త్ర సాంకేతిక ఫలాలను అందుకోవాలని, విద్యలో రాణిస్తూ..ఉన్నత ఫలితాలను సాధిస్తూ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 6వ తేదీన ఆయన పొదలకూరు మండలంలోని తాటిపర్తి వైకెకె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మాజీ రాష్ట్ర పతి, విఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం చెప్పినట్లుగా, ప్రతి విద్యార్థి ఇంజనీర్ లేదా డాక్టర్ లేదా కలెక్టర్ వంటి ఉన్నత స్థానాల్లో వుండాలని కలలు కనాలని, ఆ కలలను సాకారం చేసుకునేందుకు ఎంతో కృషి, పట్టుదలతో చదువుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థుల భవితను చక్కదిద్దేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమవంతు కృషి చేయాలన్నారు. ఎంతో మంది ప్రముఖులు సైతం ఒకప్పుడు పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారేనని ఆయన గుర్తు చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇతర దేశాలతో భారత్ పోటీ పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి, జడ్పీ సిఇఓ జితేంద్ర, తహశీల్దార్ కృష్ణారావు, ఎంఇఓ బాలకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హమీద్‌లు పాల్గొన్నారు.


సతీష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న చిన్నారులు

సింహపురి సమాచారం

# ప్రతి ఇంటికీ అకౌంట్ ఉండాలి

## - జిల్లా కలెక్టర్ ఎం.జానకి



ప్రధానమంత్రి జనధన యోజన పథకాన్ని సబ్ సర్వీస్ ఏరియాకు సంబంధించిన బ్యాంకుల్లో నూటికి నూరు శాతం ప్రతి ఇంటికి ఒక బ్యాంక్ అకౌంట్ డిసంబర్ 24వ తేదీలోపు తెరిచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి బ్యాంకర్లను కోరారు.

సోమవారం నెల్లూరు గోల్డెన్‌జూబ్లీ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి జనధన యోజన పథకం అమలు చేయు కమిటి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి పథకం ప్రకారం ఒక బ్యాంక్ అకౌంటును తెరవడంతో పాటు ఆ ఇంటిలో వున్న వివిధ రకాల లబ్దిదారులు కూడా బ్యాంక్ అకౌంట్లు తెరవాలని ఆమె అన్నారు. డిసంబరు 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరుగనున్న రైతు సాధికారక సదస్సుల్లో బ్యాంక్ అకౌంట్ల ఆవశ్యకత గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. రుణాల రికవరీ గురించి జిల్లా కలెక్టరు మాట్లాడుతూ బ్యాంకర్లు సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో పనిచేసి రుణాలను వసూలు చేసేలా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి చంద్రమౌళి మాట్లాడుతూ అర్హత వున్న స్వయం సహాయక గ్రూపుల వారికి త్వరితగతిన రుణాలు అందించాలన్నారు.

బి.సి. కార్పొరేషన్ ఇడి కోటేశ్వరరావు మాట్లాడుతూ జీరో బ్యాలెన్స్‌తో లబ్దిదారులకు అకౌంట్లు తెరవాలన్నారు.

ఈ సమావేశంలో సిండికేట్ బ్యాంక్ డిజిఎం కె.శ్రీనివాసరావు, ఆంధ్రాబ్యాంక్ డిజిఎం సురేంద్రరావు, యూనియన్ బ్యాంక్ డిజిఎం ఐ.విశ్వనాథన్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జి.మస్తానయ్య, నాబార్డు ఎజియం ఆర్.వివేకానందరెడ్డి, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజరు టి.వెంకటేశ్వరరావు, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## ఏపి జెన్‌కోలో
# పెరిగిన విద్యుత్ ఉత్పత్తి

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలంలోని నేలటూరు దామోదరం సంజీవయ్య 1600మెగావాట్ల ఏపిజెన్‌కో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం విద్యుత్ ఉత్పత్తి 803మెగావాట్లకు పెంచారు. గత ఆగస్టులో మొదటిసారిగా ఉత్పత్తి 809 మెగావాట్లకు పెంచారు. అనంతరం తలెత్తిన చిన్నచిన్న అవాంతరాలను అధిగమించి నవంబర్‌లో విద్యుత్ ఉత్పత్తి పెంచాలని నిర్ణయించారు. కాని బొగ్గులోని శక్తి చాలక పోవడంతో సాధ్యం కాలేదు. మరలా విద్యుత్ ఉత్పత్తి పెంచుతామని జెన్‌కో వర్గాలు తెలిపాయి.

# విగ్రహాల దొంగల అరెస్టు

నెల్లూరుజిల్లా బుచ్చి మండలం మునులపూడి గ్రామ శివారులోని పేరమ్మ దేవస్థానంలో ఇటీవల దొంగతనానికి గురైన నంది విగ్రహంకు సంబంధించి సోమవారం నలుగురు ముద్దాయిలను బుచ్చి ఎస్సై శ్రీనివాసరావు మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిందితులు నంది విగ్రహంలో ఆభరణాలు, వజ్రాలు ఉన్నాయని భావించి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. కారులో తరలిస్తున్న నంది విగ్రహాన్ని గ్రామస్తులు పట్టుకుని దొంగలను పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ చోరీలో ప్రధానసూత్రధారి ఇనమడుగుకు చెందిన కనిశెట్టి నాగరాజు, అతనితోపాటు కోవూరు మండలం, పోతిరెడ్డిపాలెంకు చెందిన అల్లం నరేంద్ర కుమార్, నెల్లూరుకు చెందిన జలదంకి వెంకటకృష్ణ, తమిళనాడులోని తిరుచ్చి గ్రామానికి చెందిన దామోదరం, మరో నలుగురు ఉన్నారన్నారు. వీరంతా పలు గ్రామాల్లో రెక్కి నిర్వహించి, చివరగా మునులపూడి గ్రామంలో దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు.



# అవినీతి వ్యతిరేకంగా - నేనుసైతం

అవినీతి రహిత సమాజం లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి "అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం"ను పురస్కరించుకుని "అవినీతి వ్యతిరేకంగా – నేను సైతం" కార్యక్రమాన్ని మంగళవారం నెల్లూరులోని శ్రీ నేతాజీ(ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్‌లో నిర్వహించారు.

లోక్‌సత్తా పార్టీ నెల్లూరుజిల్లా అధ్యక్షులు ఆర్.అంకయ్యచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని అవినీతి వలన జరుగు నష్టాలను విద్యార్థులకు వివరించారు. దేశాభివృద్ధికి అవినీతి ఆటంకమని, పౌరసమాజం స్పందించాలని, అవినీతి నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు.

సంస్థ ప్రిన్సిపాల్ ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి నిజాయితీగా ఉంటూ నవసమాజ స్థాపనకు నిర్మాతలుగా మెలగాలని, తద్వారా దేశాభివృద్ధి, సామాజిక విలువలు పెరుగుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. అవినీతి వ్యతిరేకంగా ఎలా మెలగాలో చెబుతూ చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వాణి, హెడ్‌మిస్ట్రెస్ శ్రీమతి ప్రసన్న, హెడ్‌మాస్టర్ సుధాకర్‌రావు, ఇన్‌ఛార్జ్ ఆనీగ్రేస్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవతరగతిలో
# ఉత్తమ ఫలితాలు సాధించాలి

## జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి

నెల్లూరుజిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న 38జిల్లా పరిషత్ హైస్కూళ్ళు, 3గురుకుల పాఠశాలలు, రెండు ఏపిఆర్‌జేసీ, మోడల్ స్కూల్, కస్తూరిబా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు.

## అధికారులు...
# సమన్వయంతో పనిచేయాలి

## - సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి

అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ అధికారులు రైతు సమస్యలపై దృష్టి సారించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి.సావిత్రమ్మ, తహశీల్దార్ శీలం రామలింగేశ్వరరావు, ఎంపిపి నాయుడు గిరిజమ్మ, జడ్పీటీసీ మన్నెం చిరంజీవిగౌడ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల్లో
# ఎంఆర్‌పి ధరలు అమలు చేయాలి

## వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల

నెల్లూరుజిల్లా రాపూరు మండలం గోనుపల్లి మద్యం దుకాణం వద్ద ఎంఆర్‌పి ధరలు అమలు చేయాలంటూ వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం స్థానికులు, కార్యకర్తలతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాందీషాపుల యజమానులను పిలిపించి ఎంఆర్‌పి ధరలను పాటించాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఇవి లేకుండా వ్యాపారాలు చేస్తే షాపులను మూతవేయిస్తానని చెప్పగా దుకాణ యజమానులు అంగీకరించడంతో ధర్నాను విరమించారు. అనంతరం పెంచలకోన దేవస్థానం ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని, కార్యకర్తలు ఆలయ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం ఇఓ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 6 నెలలు...
# 300 అబద్ధపు హామీలు

## - వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసి 6నెలలు పూర్తయిందని, అందులో 300అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజల్ని మభ్యపెట్టారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. సోమవారం నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెంలోని వైసిపి నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి అతిథి గృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పింఛన్‌లు, రేషన్‌కార్డులలో భారీగా కోతలు పెట్టారన్నారు. విదేశీ పర్యటనలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర పాలనను గాలికొదిలేశాడన్నారు. సింగపూర్, జపాన్ పర్యటనలకు తనతో పాటు మరో 30మందిని ప్రత్యేక విమానంలో తీసుకువెళ్లి రాష్ట్ర ఖజానాకు గండికొట్టారన్నారు. ప్రజలు, రైతులు అవస్థలు పడుతుంటే హైదరాబాద్‌లోని తన సచివాలయానికి రూ.48కోట్లు ఖర్చుపెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవా కేంద్రాల్లో ఇసుక

బిల్డర్లు తమకు కావలసిన ఇసుకను మీ సేవా కేంద్రాల ద్వారా బుక్ చేసుకోవాలని, వారికి బల్క్ కావాలంటే డిడి రూపేణ చెల్లించి పూర్తి వివరాలను తెలుపవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అన్నారు.

సోమవారం బిల్డర్లతో ఇసుక క్రొత్త విధానం గురించి ఆమె వివరిస్తూ బిల్డర్లు తమ సొంత వాహనంలోనైనా ఇసుకను తీసుకొని పోవచ్చన్నారు. బల్క్ ఆర్డర్లకు పెట్టిన వారు టిప్పర్లను కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. వారి సొంత వాహనం లేకపోతే రిజిష్టర్ అయిన వాహనాలతో ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక డిమాండ్ ఎంత ఉన్నదని కలెక్టర్ బిల్డర్లను అడిగారు. బిల్డర్లు మాట్లాడుతూ భవన నిర్మాణాలు మందకొడిగా ఉన్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బాగున్నదని, ఈ పద్ధతి ద్వారానే ఇసుకను కొనుగోలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, మెప్మా పిడి ఏసు రత్నం, బిల్డర్లు పి.వి.రాఘవరావు, డి.రామకృష్ణ, టి.నరేంద్రరెడ్డి, జె.మదనమోహన్‌రెడ్డి, టి.మధుసూదన్‌లు పాల్గొన్నారు.

రాజకీయరంగు పులుముకున్న

# రహదారి విస్తరణ

***అభివృద్ధి జరిగినా విమర్శలుంటాయి... జరగకపోయినా విమర్శలుంటాయి. పని చేసినా ఆరోపణలుంటాయి.. చేయకపోయినా ఆరోపణలుంటాయి. రాజకీయాలలో ఇది కామన్. నెల్లూరు ట్రంకురోడ్డులో మనం బైక్‌లోనో, కారులోనో పోతుంటే ట్రాఫిక్‌జాం అవుతుంది. ఒక్క నిమిషం ఆగిపోయామంటే.. అసహనంతో, ఈ పాలకులకు, అధికారులకు బుద్ధిలేదు, ట్రంకురోడ్డు ఇంత ఇరుకుగా వుంటే కనీసం రోడ్డును వెడల్పు చేయాలనే జ్ఞానం వారికి లేకుండాపోయిందని తిట్టుకుంటాం. ఆ తర్వాతరోజు అదే రోడ్డులో మనం పోతునప్పుడు నగరపాలక సంస్థ సిబ్బంది దురాక్రమణ చేసి కట్టిన ఏదన్నా కొట్టును తొలగిస్తుంటే... ఊరి నిండా ఇన్ని ఆక్రమణలుంటే వీరికి ఈ ఒక్క కొట్టే కనిపించిందా అని మనమే తిట్టుకుంటుంటాం.***

కర్ర విరక్కూడదు, పాము చావకూడదు అన్నట్లుగా తయారైంది నెల్లూరులో ట్రంకురోడ్డు విస్తరణ పరిస్థితి. ట్రంకురోడ్డు విస్తరణ జరిగే మాట దేముడెరుగు... ఇది చిలికిచిలికి రాజకీయ గాలివానగా మారుతోంది. రోడ్డును విస్తరించండి.. కాని వ్యాపారులు రోడ్డున పడకూడదు... ఇదీ ఆయా పార్టీల నాయకుల ఫిలాసఫీ. కాని వీటిలో ఏదో ఒకటే జరుగుతుందని, రెండూ కావాలంటే ఎలా కుదురుతుందని అధికారుల ఆవేదన. నెల్లూరును స్మార్ట్‌సిటీగా చేయాలంటే ట్రంకురోడ్డు విశాలంగా ఉండాలని, ఆ పని జరిగాకే మిగతా పనులు చూసుకుందామని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు లింకుపెట్టాడు. ట్రంకురోడ్డు వెడల్పు పేరుతో మా పొట్టలు కొట్టొద్దు, మా బ్రతుకులను ట్రంకురోడ్డు మీద పడేయవద్దంటూ వ్యాపారులు రోదిస్తున్నారు. తమ బాధకు అక్షరరూపం కల్పిస్తూ తమ దుకాణాల ముందు తలా ఒక ఫ్లెక్సీ కూడా తగిలించారు. వారి బాధ అర్థం చేసుకోదగినదే. ఎందుకంటే ఆక్రమణలుంటే తొలగించాల్సిందే! కాని ఇప్పుడు ట్రంకురోడ్డు విస్తరణ జరిగితే పోయేది ప్రైవేట్ స్థలాలే. ముఖ్యంగా సన్న చిన్న వ్యాపారులు ఎక్కువుగా నష్టపోయే అవకాశముంది. అయితే రోడ్డు విస్తరణ మాట ఎలా వున్నా దీనిని కేంద్రంగా చేసుకుని రాజకీయ యుద్ధం మొదలైంది. ఎలాంటి నోటీసులు పాడూ లేకుండా వ్యాపారస్థుల దుకాణాలు ఎలా కూలగొడతారంటూ వైకాపా, కాంగ్రెస్ నాయకులు నిలదీస్తున్నారు. తెలుగుదేశం నాయకులకు కూడా వ్యాపారులను నష్టపరచడం ఇష్టంలేదు. కాని వాళ్లు బహిరంగంగా నిరసించలేకపోతున్నారు. నగరంలో రోడ్డు వెడల్పుకు ఇంతవరకు మార్కింగ్ మాత్రమే ఇచ్చారు. రాజకీయంగా తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో దీనిపై కార్పొరేషన్ అధికారులు ముందడుగు వేయలేకున్నారు. రోడ్డు వెడల్పుకు ప్రొక్లెయిన్ కదిలిందంటే పెద్ద రాజకీయ సీన్ సృష్టించడానికి వైకాపా, కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారు.



కార్యక్రమ వివరాలను వెల్లడిస్తున్న తానా చైతన్య స్రవంతి అడ్వయిజరీ కమిటి ఛైర్మెన్ రవి సన్నారెడ్డి

డిసెంబర్ 18న

# నెల్లూరులో తానా చైతన్యస్రవంతి

తెలుగు సంస్కృతి సంప్రదాయాల మేళవింపుతో ఈ నెల 18వతేది నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల దాకా తానా చైతన్యస్రవంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు అడ్వయిజరీ కమిటీ ఛైర్మెన్ శ్రీసిటీ ఎం.డి రవిసన్నారెడ్డి తెలిపారు.

బుధవారం నెల్లూరులోని డిఆర్ ఉత్తమ్ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2015 జూలై నెలలో తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) 20వ ద్వైవార్షిక సదస్సు అమెరికాలో జరుగుతుందని, అందులో భాగంగా 'తానా' తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ స్థానిక కళలకు, కళాకారులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి విదేశాల్లో వుంటున్న నెల్లూరీయులు, పారిశ్రామికవేత్తలు సుమారు 35 మంది దాకా వచ్చే అవకాశం వుందన్నారు. నెల్లూరుజిల్లా నుంచే కాక, ఇతర జిల్లాల నుంచి వచ్చే కళాకారులను ప్రోత్సహిస్తామన్నారు. 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ సాహిత్యం, కళలు, పాత్రికేయ, వ్యవసాయ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనుపరచినవారికి సన్మానం చేస్తామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కళాకారులకు సహాయం అందిస్తామన్నారు. గిడుగు రామ్మూర్తి అవార్డును ప్రముఖులకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గత 38 సంవత్సరాలుగా రెండేళ్ళకొకసారి జరుపుకునే తానా సంబరాలను సింహపురివాసులందరూ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ హీరో రాజేంద్రప్రసాద్, జబర్దస్త్ యాంకర్ రేష్మి, ఇతర నటులు పాల్గొంటున్నారని, సినీ గాయకులు దీపు, ప్రవీణ్, గంగాధర్ తదితరులచే సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తానా చైతన్యస్రవంతికి సంబంధించిన పలు కమిటీల ఛైర్‌పర్సన్‌లు రావి మోహన్‌చౌదరి, వి.విజయకుమార్‌రెడ్డి, కళాంజలి అనంత్, నలుబోలు బలరామయ్యనాయుడు, బి.మనోహర్‌రెడ్డి, డి. హేమంత్‌కుమార్, జి.శ్రీనివాసులురెడ్డి, సిహెచ్ మురళి, వి.చంద్రయ్యచౌదరి, బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, వంశీధర్, చందు, టివిఎస్ చలపతిరావు, ఎన్.శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలు చూసి కన్నీళ్లొస్తున్నాయి

**- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని మల్లాయగుంట ప్రజల కష్టాలు చూస్తే ఎంతో ఆవేదన కలుగుతోందని, అధికారులు ఇకనైనా ఇక్కడి ప్రజల కష్టాలు తీర్చాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆయన మోకాటిలోతు బురదతో వున్న కొత్తూరు-మల్లాయగుంట రోడ్డులో నడచివచ్చి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మల్లాయగుంట నుంచి కొత్తూరు మెయిన్ రోడ్డుకు రావాలంటే రెండు కిలోమీటర్లు అద్వాన్నపు రోడ్లమీద, కాలువలో దిగి నానా బాధలుపడి రావాల్సివస్తోందన్నారు. గత యాభై ఏళ్ళుగా నెల్లూరు నగరంలో నివాసం వుంటున్న నిరుపేదలను ఖాళీ చేయించి ఈ ప్రాంతంలో వదిలేశారని, కానీ ఇక్కడ వారికి కనీస వసతులు కూడా కల్పించకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అద్వాన్నంగా వున్న ఇక్కడి రోడ్డును బాగుచేయాలని, మల్లాయగుంట ప్రజలకు కనీస వసతులు కల్పించాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కదలివచ్చి ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీర్చాలని, మంత్రి పి.నారాయణ ఇలాంటి ప్రాంతాలపై దృష్టిసారించి ప్రజలకు కనీస వసతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి వెంట స్థానిక నాయకులు కె.ప్రసాద్, కమల్‌రాజ్, నవీన్, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సాయినాథ స్థిరబింబ యంత్ర ప్రతిష్ట

నెల్లూరుజిల్లా నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడు గ్రామంలో శ్రీ షిరిడి సాయిబాబా వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు వైభవంగా జరిగింది. గణపతిపూజ, అఖండ దీపస్థాపనం, వేదపారాయణం, అగ్నిప్రతిష్ట, నవగ్రహ మండప ఆవాహనం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, నవరత్న న్యాసము, ధాతున్యాసము, అన్నదానం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను లేబూరు సుధాకర్‌రెడ్డి, గిరిజమ్మ, లేబూరు మాధవరెడ్డి, వసుంధర, లేబూరు రమణారెడ్డి, మాధవి, కుటుంబసభ్యులు పర్యవేక్షించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# దోపిడీ దొంగలముఠా అరెస్ట్

**రూ.12లక్షలు సొత్తు స్వాధీనం**



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెక్కీలు నిర్వహిస్తూ ఇంట్లో ఒంటరిగా మహిళలు, వృద్ధులు వుంటే వారిని గమనించి కత్తులతో బెదిరించి ఇంట్లో ఉన్నదంతా దోచేస్తున్న అంతర్‌జిల్లా దోపిడీ దొంగల ముఠాలోని ముగ్గురిని నెల్లూరుజిల్లా కోవూరు పోలీసులు, సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేయడమే కాకుండా వారి వద్ద నుండి దాదాపు రూ.12లక్షల విలువ చేసే 50సవర్ల బంగారు ఆభరణాలు, 4 సెల్‌ఫోన్‌లు, 3కత్తులు తదితర వస్తువులను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో నెల్లూరుజిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆ వివరాలు తెలిపారు. గుంటూరుజిల్లా సత్తెనపల్లి రోడ్డు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఎనమోలు దుర్గారావు అలియాస్ దుర్గా ఆటో డ్రైవర్‌గా, బేల్దారి పనులు చేస్తూ చిల్లరదొంగతనాలు చేసేవాడనీ, ఈ క్రమంలో తనకు జైల్లో పరిచయమైన వెలగా రవి, అతని స్నేహితుడు ఆరుమూళ్ల వంశీకృష్ణలతో కలిసి దోపిడీలకు పాల్పడేవారని, ఈ ముగ్గురు కలిసి విజయవాడ, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడేవారని ఆయన వివరించారు. వీరు ముగ్గురు కోవూరు బైపాస్‌రోడ్డులోని ఆర్‌కె హోటల్ సమీపంలో ఉన్నారని కోవూరు సిఐకి సమాచారం రావడంతో పక్కా వ్యూహంతో వారిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.




# 'ప్రభా'తం

దేశంలో ప్రస్తుతం వున్న ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కేంద్రంతో పాటు రాష్ట్రాలకు, ఆర్థిక నిపుణులకు, పారిశ్రామిక రంగానికి చెందినవారికి తగు ప్రాధాన్యత కల్పించేలా, ఒక సరికొత్త ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటుకు కేంద్రం సంకల్పించడం హర్షదాయకం. ఇది శుభసంకల్పమేనని చెప్పొచ్చు.

ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో ఇటీవల ఆ కొత్తవ్యవస్థకు రూపకల్పన చేస్తూ, ప్రధానమైన మూడు బృందాలతో కలసి 'టీమ్ ఇండియా' ఏర్పాటుకు నిర్ణయించడం దేశపురోగతికి మరింత శుభదాయకం. ఈ సరికొత్త వ్యవస్థ ఏర్పాటుచేయాలన్న ప్రధాని మోడీ ఆలోచనలకు దేశంలోని మెజార్టీ ముఖ్యమంత్రులు ఆమోదముద్ర వేయడం ఒక మంచి మార్పుకు శ్రీకారం. అభివృద్ధి చెందిన దేశాలలో జరుగుతున్న విధంగానే, ప్రభుత్వ చట్టానికి వెలుపల సాగుతున్న ఆర్థిక కార్యకలాపాలు కూడా దేశాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన ప్రక్రియలో తగిన ప్రాతినిధ్యం వుండేలా చేయడం ఈ కొత్త వ్యవస్థ ధ్యేయంగా వుండాలన్న ప్రధాని ఆలోచనలు..ప్రతిపాదనలు దేశ ప్రగతి ప్రస్థానంలో మరో ముందడుగు వేసేందుకు దోహదం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ కొత్త వ్యవస్థలో రాష్ట్రాలకు మరింత ప్రాతినిధ్యం ఇవ్వాలని, రాష్ట్రాలను పటిష్టవంతం చేసేవిధంగా కొత్త వ్యవస్థ వుండాలని, రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమన్నది ప్రధాని అభిప్రాయం. దేశంలో కీలకభూమిక పోషిస్తున్న మూడు బృందాలు.. ఒకటి-ప్రధాని, ముఖ్యమంత్రులు, రెండు-ప్రధాని, కేంద్ర మంత్రులు, మూడు-ప్రధాని, ప్రభుత్వాధికారుల సమ్మిళిత బృందంగా రాబోయే కొత్త ప్రణాళికా సంఘం వుండాలన్నది ప్రధాని ఆలోచన. ఈ మూడు బృందాలతో కలిపి 'టీమ్ ఇండియా' రూపొందు తుంది. అది ప్రణాళికా సంఘానికి ప్రత్యామ్నాయ రూపంగా రూపుదిద్దుకోనుంది. ఈ విషయాలన్నిటిపై మరింత స్పష్టత కోసం ఇంకా మరింతమంది ఆర్థిక నిపుణులు, తదితరులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ప్రభుత్వం ఈ కొత్తవ్యవస్థ రూపురేఖలపై తుది నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు. రాష్ట్రాల అవసరాలు, ఆలోచనలు, వాటి ప్రాధాన్యతలకు సముచితస్థానం వుండేలా చూడడం ఈ కొత్తవ్యవస్థలో మరో ముఖ్యమైన అంశం. ఆ మేరకు ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 6న ఢిల్లీలోని తన నివాసంలో ముఖ్యమంత్రులతో కలసి రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని, ఈ విషయాలపై అందరి తోనూ చర్చించారు. తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తం చేసేందుకు తగిన వేదికలు అందుబాటులో లేవని రాష్ట్రాలు భావిస్తున్న తరుణంలో, అందరి అభిప్రాయాలను గౌరవించే ఒక నూతన వ్యవస్థ రూపుదాల్చనుండడం రాష్ట్రాలకు కూడా ఎంతో సంతోషం కలిగించే విషయం. అందుకు తగ్గట్టుగానే, రాష్ట్రాల్లో అంతర్‌రాష్ట్ర వివాదాలు, పలు జటిలసమస్యల పరిష్కారానికి ఒక సమర్థవంతమైన యంత్రాంగం అవసరం వుంది కనుక, రానున్న కొత్త ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలు కీలకపాత్ర పోషించాలని ఈ సందర్భంగా ప్రధాని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధే ప్రధాన ప్రాధాన్యతాంశంగా పురోగమిస్తున్న ఈ దశలో ఇలాంటి కొత్తవ్యవస్థ రూపకల్పనకు ప్రధాని శ్రీకారం చుట్టడం ఎంతైనా ముదావహం. ఇదే సందర్భంలో, కాలం చెల్లిన ప్రణాళికా సంఘం స్థానంలో కొత్త వ్యవస్థను ఏర్పాటుచేయాలన్న ప్రధాని నరేంద్రమోడీ ప్రతిపాదనకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కొన్ని తమ సహజధోరణిలో వ్యతిరేకత వ్యక్తం చేసినప్పటికీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సహా దేశంలోని మెజార్టీ ముఖ్యమంత్రులంతా ఆ ప్రతిపాదనలకు మద్దతు ప్రకటించడం విశేషం. దేశంలోని వివిధ ప్రాంతాల అవసరాలు, లభ్యమయ్యే వనరులను దృష్టిలో వుంచుకుని వికేంద్రీకరణ పద్ధతిలో సరైన ప్రణాళికలను రచించగలిగితే పేదరికం నిర్మూలన, ఆర్థిక అసమానతల తొలగింపు సాధ్యమేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

అదేవిధంగా, అభివృద్ధి ప్రక్రియలో రాష్ట్రాలను కేంద్రంగా చేయడం స్వాగతించదగిన విషయమని తమిళనాడు ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలా అధికశాతం ముఖ్యమంత్రులు ఈ ప్రతిపాదనలను ఆమోదించడం విశేషం. ఏదేమైనప్పటికీ, దేశంలో అలముకుని వున్న కష్టాల కారుచీకట్లు, రైతన్నల అగచాట్లు, ఒకవైపు పేదరికం, మరోవైపు నిరుద్యోగం.. ఇంకోవైపు గణనీయంగా పెరిగిపోతున్న జనాభా.. ఇలా అనేకానేక సమస్యలన్నిటినీ పరిగణన లోకి తీసుకుని, ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థి తులు, వనరులు, సమస్యలు అన్నిటినీ దృష్టిలో పెట్టుకుని సరికొత్త ఆలోచనలతో ఆ సమస్యలన్నిటినీ అధిగమించి, దేశవ్యాప్తంగా ప్రగతికి సోపానాలు నిర్మించాలంటే చిన్న విషయమేమీ కాదు. అందు లోనూ, పురోగామి దశలో వున్న మనదేశంలో ఇలాంటి ఆలోచనలు, వాటికి తగ్గ ఆచరణ అత్యవసరం. అప్పుడే ఆశించిన సత్ఫలితాలు వచ్చేందుకు మార్గం సుగమం అవుతుంది. అందులోనూ ప్రధాని నరేంద్ర మోడీ గతంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి బాధ్యతలు కూడా చేపట్టివున్న నేపథ్యంలో, రాష్ట్రాల్లో ముఖ్య మంత్రులు పడే సాధకబాధకాలన్నీ ఆయనకు అనుభవైకవేద్యమే. కనుక, ఇలాంటి సరికొత్త వ్యవస్థ ద్వారా దేశ ప్రగతికి మరిన్ని మంచిదారులు వేయవచ్చనే ఆలోచనతో ప్రధాని దీని రూపకల్పనకు సమాయత్తమైవుండవచ్చని భావించవచ్చు. ప్రణాళిక వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ జరిగి, తిరిగి జవసత్వాలతో ఆ వ్యవస్థ ముందుకు సాగాలని, దేశవ్యాప్తంగా ప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్టుగా, దేశం ఆశించిన పురోగతి సాధించాలన్నది ప్రధాని ధ్యేయం. కనుకనే, ఆయన అందుకు ఎంతో ప్రధానమైన ప్రణాళికా వ్యవస్థకు కొత్త రూపు సంతరిస్తున్నారన్నది సామాన్యులకు సైతం అర్థమవుతున్న విషయం.

ఇలాంటి బృహత్తరమైన వ్యవస్థకు ప్రధాని నరేంద్రమోడీ దిశానిర్దేశం చేయడం శుభ పరిణామం. ప్రణాళికా సంఘం పునర్వ్యవస్థీకరణకు సంబంధించి నిపుణులతో అన్ని రకాల పరిశీలనలు, సంప్రదింపులు జరిగి, వీలైనంత త్వరలోనే ఈ నూతన వ్యవస్థ ప్రారంభం అవుతుందని అందరూ ఎదురుచూస్తున్నారు.

## శుభసంకల్పం



దేశవ్యాప్తంగా అభివృద్ధే ప్రధాన ప్రాధాన్యతాంశంగా పురోగమిస్తున్న ఈ దశలో ప్రణాళికాసంఘానికి కొత్త రూపం ఇస్తూ.. ఓ సరికొత్త వ్యవస్థ రూపకల్పనకు ప్రధాని శ్రీకారం చుట్టడం ఎంతైనా ముదావహం. తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తం చేసేందుకు తగిన వేదికలు అందుబాటులో లేవని రాష్ట్రాలు భావిస్తున్న తరుణంలో, అందరి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా..ఒక నూతన వ్యవస్థ రూపుదాల్చనుండడం రాష్ట్రాలకు కూడా సంతోషం కలిగించే విషయం.

# లంచం ఇస్తేనే పించన్లంట

**- ఎమ్మెల్యే అనిల్**



నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ 8వ తేదీ నెల్లూరు నగరంలోని 51వ డివిజన్‌లోని కపాడి పాళెం, సుబేదారుపేట ప్రాంతాల్లో పర్య టించి పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా వంటి సమస్యలను ప్రజలను అడిగి తెలుసు కున్నారు. స్థానికంగా నిర్మిస్తున్న హాస్టల్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర క్రిస్మస్ పండుగ ఈ నెలలోనే కాబట్టి నగరంలోని అన్ని చర్చిల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టి పరిశుభ్రంగా వుంచాలని, అలాగే ఎక్కువమంది క్రిస్టి యన్లు నివసించే కపాడిపాళెం ప్రాంతంలో ప్రతిరోజూ శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు గత 3నెలలుగా పింఛన్లు ఇవ్వడం లేదని చెబుతున్నా రన్నారు. సాక్షాత్తు మంత్రిగారు 5వ డివిజన్‌లో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు 100% వికలాంగురాలైన ఒక పాపను చూపిస్తే ఇప్పటికి కూడా ఆ పాపకు పింఛను ఇవ్వడం లేదన్నారు. అనేకమంది అర్హులైన వృద్ధులు, విక లాంగులు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ, కార్పొరేటర్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారని, కొన్నిచోట్ల కొంత మంది లంచం ఇస్తేనే సంతకం పెడతా మని అంటున్నారని, నిజంగా ఇది సిగ్గుచేటని, వృద్ధులు ఎవరు సహాయం లేకుండా పింఛన్లపై ఆధారపడి బ్రతుకు తుంటే వారిని కూడా శవాలుపై బొరు గులు ఏరుకున్నట్లుగా లంచం అడ గడం దారుణమన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు మీదూరి ప్రశాంతికుమార్, ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధ వయ్య, దేవరకొండ అశోక్, నాయకులు వేలూరు మహేష్, కుంచాల శ్రీని వాసులు, వందవాసి రంగ, అరవ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతాంగం హర్షం

పార్లమెంటులో పొగాకు నియంత్రణ బిల్లు ప్రతిపాదనలను ఆపేందుకు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు తీసుకున్న చొరవపై రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పొగాకు రైతు సంఘం నాయకులు ఆర్.శ్రీకాంత్‌బాబు, రూరల్ నవనిర్మాణ వేదిక వ్యవస్థాపకులు వేళ్ల నరేంద్రబాబు తెలిపారు. రైతు సంఘాల ఢిల్లీ పర్యటన వివరాలను నెల్లూరుజిల్లా కలిగిరిలో మంగళవారం వారు వివరించారు. డబ్ల్యూహెచ్‌వో నిబంధనల మేరకు పొగాకు పంట నియంత్రణ గురించి ఎఫ్‌సిటిసి తీసుకున్న నిర్ణయానికి భారత ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. పొగాకు రైతుల పరిస్థితులను రాష్ట్ర ఎంపీలు మాగుంటబాబు సుజనాచౌదరి, రాయపాటి సాంబశివరావు, గల్లా జయదేవ్, సుబ్బారెడ్డి, ఎస్‌పివై రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడులకు వివరించామన్నారు. రైతుల పరిస్థితులను వెంకయ్యనాయుడు అర్థం చేసుకుని కేంద్ర వ్యవసాయ, ఆరోగ్య, వాణిజ్యమంత్రులతో సమీక్ష జరిపారని, అందరి ఆమోదంతో పొగాకు నియంత్రణ బిల్లు ప్రతిపాదనలు నిలిచాయన్నారు.

## చచ్చేవాణ్ణి చదవేసినట్టు


రాష్ట్రంలో వైకాపా 66మంది సభ్యులతో బలంగా ఉన్నప్పటికీ అధికారపక్షాన్ని ఇరుకునపెట్టే పెద్ద ఉద్యమం నడపడానికి ఇది అనువైన సమయం కాదు. సారవంతమైన తమ భూములను ల్యాండ్ స్పాచర్ బాబు లాక్కుంటాడని కొంతమంది రైతులు, రుణాలు మాఫీ కాక, కొత్త రుణాలు రాక కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకునే ఈ సమయంలో పెద్దఉద్యమాన్ని నడపడం చచ్చేవాణ్ణి చదవేసినట్టుంటుంది!

**- కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## తీవ్రవాద స్వాములు

రాజకీయ అండదండలతో దొంగస్వాములు రెచ్చిపోతున్నారు. రాంపాల్ వంటి తీవ్రవాద స్వాములు అరాచక శక్తులుగా మారారు. కొన్ని లోపాలున్నా సత్యసాయిబాబా, రాందేవ్‌లు సమాజానికి ఉపయోగపడుతున్నారు. కొందరు బాబాలు వ్యభిచార కేంద్రాలు నడుపుకుంటున్నారు. విద్యావంతులు, శాస్త్రజ్ఞులు సైతం ఇలాంటి బాబాలకు మొక్కరిల్లడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్వాములు శాసనకర్తలుగా మారుతున్నారు. మతం పేరిట, మహత్తు పేరిట విధ్వంసం సృష్టిస్తున్నారు. ఇలాంటి బాబాలపై చర్యలు తీసుకోవాలి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**




## తెలుగుగంగకు శీనయ్య పేరు

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తెలుగుగంగ పథకానికి రూపకల్పన చేసిన వారిలో దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రముఖపాత్ర పోషించారు. చెన్నై నగరానికి పైప్‌లైన్ల ద్వారా నీరందించాలని అధికారులు సూచిస్తే, శీనయ్య తిరస్కరించారు. కాలువ ద్వారా నీరందించే పథకానికి రూపకల్పన చేశారు. నెల్లూరుజిల్లా రైతాంగం సమస్యల మీద ఆయన నిరంతరం పోరాడారు. ఈ కాలువకు శీనయ్య పేరు పెట్టాలి. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు దీనికి చొరవచూపాలి.

**ఏ. అశోక్, అడ్వకేట్, నెల్లూరు.**

## ఆత్మకూరుబస్టాండ్‌లో అవస్థలు

నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌లో ప్రయాణీకులు అగచాట్లు పడుతున్నారు. మరుగదొడ్లు, ప్రయాణీకులు కూర్చోవడానికి బల్లలు సక్రమంగా లేవు. బస్టాండ్‌లో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి.

**- జె.కామాక్షి, కావలి.**



దేశానికి వాజ్‌పేయి ప్రధాని కావాలనుకున్నాను... అది నెరవేరింది. ప్రధాని పక్కన పార్టీ అధ్యక్షుడి హోదాలో కూర్చున్నాను. పార్టీకి పూర్తి మెజార్టీ రావాలని కలకన్నాను. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆ కల కూడా నెరవేరింది. ఇప్పుడు మహారాష్ట్రలో అధికారంలోకి రావాలనుకున్నాను... అదీ జరిగింది. రేపు పశ్చిమబెంగాల్‌లోనూ అధికారంలోకి రావాలనుకుంటున్నాం... ఆ కల కూడా నెరవేరుతుంది. ఇటీవల ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చేసిన ప్రసంగంలో కలల సారాంశమిది. వెంకయ్య ఎప్పుడూ కేంద్రంలో, పక్క రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి రావాలనుకోవడమేనా? సొంత రాష్ట్రం ఏపిలో అధికారంలోకి రావాలని కలలు కనడం లేదేమని చాలామంది ప్రశ్నిస్తున్నారు. ఇదీ నిజమే... వెంకయ్య కేంద్రం, పక్క రాష్ట్రాల గురించి ఆలోచిస్తున్నాడుగాని సొంత రాష్ట్రంపై దృష్టి పెట్టడంలేదని పార్టీలోనే విమర్శలు వస్తున్నాయి. వెంకయ్య గట్టిగా దృష్టి పెడితే ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీని పటిష్టం చేయడం పెద్ద సమస్య కాదు.

# మరి ఏపి కల నెరవేరేదెప్పుడో?

వాస్తవానికి 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని పెట్టకపోయి వుంటే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయంగా బలపడి వుండేది. ఆరోజుకు రాష్ట్రంలో కాంగ్రెస్ తప్ప ఇంకేపార్టీ బలంగా లేదు. రెండో స్థానంలో బీజేపీ బలపడసాగింది. తెలుగుదేశం రాకపోయి వుంటే ఆ తర్వాత ఐదు లేదా పదేళ్లకు బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా తయారయ్యేది. తెలుగుదేశం రావడంతోనే బీజేపీ బలహీనపడుతూ వచ్చింది. 1983తో పోలిస్తే ఇప్పుడు పార్టీ బలహీనంగా మారింది. కేడర్ అంతా ఇతర పార్టీలవైపు వలసపోతూ వచ్చింది. 1985 నుండి కూడా ఒకట్రెండుసార్లు తప్పితే మిగతా అన్ని ఎన్నికలలోనూ తెలుగుదేశంతో పొత్తు పెట్టుకుంటూ వచ్చారు. దీంతో బీజేపీ సొంతంగా ఎదిగే పరిస్థితి లేకుండాపోయింది. ఒకరకంగా తెలుగుదేశాన్ని బ్రతికించడం కోసం బీజేపీని బలిచేసుకుంటూ వచ్చారని చెప్పవచ్చు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీతో పొత్తు తెలుగుదేశంకు బాగా ఉపయోగపడింది. దేశంలో వీలైనన్ని ఎక్కువ రాష్ట్రాల్లో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ప్రధాని మోడీ, అధ్యక్షుడు అమిత్‌షా శ్రమిస్తున్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో తమ లక్ష్యాన్ని ఛేదించారు. ఇదే టార్గెట్‌ను ఏపిలోనూ సాధించడానికి అవకాశాలున్నాయి. ఈ రాష్ట్రానికి చెందిన వెంకయ్యనాయుడే దానికి పూనుకోవాలి. ఏపిలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలన్న ఒక స్వప్నాన్ని ఆయన రూపొందించుకోవాలి. వెంకయ్య ఈరోజు రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు నడుంకడితే వైకాపా, కాంగ్రెస్‌ల నుండే కాదు, అధికార తెలుగుదేశం నుండి కూడా చాలామంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా వున్నారు. బీజేపీని రాష్ట్రంలో ముందుకు తీసుకెళ్లడానికి ఇదే సరైన సమయం. మోడీ విధానాల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్న తరుణంలో వెంకయ్యే 'ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్' చేపట్టాల్సివుంది.



## గట్టిగా కృషి చేస్తే..
# ట్యాంక్ బండ్ సాధ్యమే!

సమర్థుడికి ఎకరా బంజరుభూమి ఇచ్చినా నాలుగుపుట్లు పండిస్తాడు. అదే అసమర్థుడికి పదెకరాల మాగాణి ఇచ్చినా పందుంవొడ్లు కూడా పండించలేడు. ప్రభుత్వ శాఖలలో పనులు కూడా అంతే! సమర్థులైన అధికారులుంటే అవకాశాలు లేకున్నా వెదికి మరీ పనులు చేస్తుంటారు. యాధృచ్ఛికమో, నెల్లూరుజిల్లాకు వచ్చిన మంచి అవకాశమో ఏమోగాని జిల్లా ఉన్నతాధికారులంతా ప్రస్తుతం సమర్థులు, సమర్థించదగినవారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ... అందరూ పనిమీద శ్రద్ధ, ఏదో ఒక మంచిపని చేయాలన్న ఆసక్తి ఉన్నోళ్లే! ఈ కోవకు చెందినవారే నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబు. నెల్లూరు నగరాభివృద్ధిపై ఆయన బాగా దృష్టిపెట్టారు. నగరంలో రహదారుల విస్తరణ, ఆక్రమణల తొలగింపు వంటివాటిపై ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్న ఆయన, తన హయాంలోనే నెల్లూరు ప్రజలకు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే కానుకను ఇవ్వాలనుకుంటున్నారు. అదే నెల్లూరులోని స్వర్ణాల చెరువును హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తరహాలో తీర్చిదిద్దడం. కమిషనర్ దీనిపై చొరవతీసుకుంటున్నట్లు తెలుస్తుంది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ కంటే కూడా స్వర్ణాలచెరువు చాలాపెద్దది. కొత్తూరు వద్ద నుండి మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం మీదుగా పొట్టేపాలెం వరకు చెరువు కట్టను తీసుకుంటే 12కిలోమీటర్ల దాకా వుంటుంది. ఈ చెరువు కట్ట వెంబడి 60అడుగుల రోడ్డు నిర్మించడం, పార్కులు అభివృద్ధి చేయడం, కట్టమీద పర్యాటకులు కూర్చునే విధంగా బెంచీలు వేయడం... ఇవన్నీ మున్సిపల్ అధికారులు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే చెరువు వద్ద ప్రతి ఏటా రొట్టెలపండుగ జరుగుతుంది. అంతర్జాతీయంగా ఈ చెరువుకు ఆ పండుగవల్ల ప్రాధాన్యత ఏర్పడింది. అంతేగాక పున్నమి అతిథి గృహంతో పాటు పర్యాటకుల విహారానికి బోట్‌షికారు కూడా వుంది. అయితే ట్యాంక్‌బండ్ తరహాలో తీర్చిదిద్దితే పర్యాటకుల సంఖ్య పెరిగి బోట్‌షికార్ ఇంకా అభివృద్ధి చెందే అవకాశముంది.

గత కాంగ్రెస్ హయాంలోనే నెల్లూరుచెరువును ట్యాంక్‌బండ్ లాగా చేయాలని ఆలోచించారు. నెల్లూరీయుడైన మాజీపోలీసు ఉన్నతాధికారి ఆంజనేయరెడ్డి పర్యాటక శాఖ మేనేజింగ్ డైరక్టర్‌గా ఉన్నప్పుడు ఇదే ప్రాజెక్ట్ చేపట్టాలనుకున్నారు. అప్పుడు ఎమ్మెల్యేగా వున్న ఆనం వివేకానందరెడ్డి కూడా స్వర్ణాలచెరువును ట్యాంక్‌బండ్‌గా చేసి, కొందరు మహనీయుల విగ్రహాలు పెట్టడంతో పాటు చెరువు మధ్యలో శివలింగాన్ని ప్రతిష్టిస్తారని కూడా చెప్పారు. అయితే ఈ ప్రాజెక్టుకు ఎవరూ నిధులు విడుదల చేయకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కమిషనర్ దీనిపై దృష్టిపెడితే నెల్లూరు నగరపాలక సంస్థ నిధులతో పాటు కొన్ని ప్రైవేట్ కంపెనీలు కూడా సహకరించే అవకాశాలున్నాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టి విజయవంతంగా పూర్తి చేయడానికి అవకాశముంది.

## సింహపురికి...
# మహిళా అధికారులే సింగారం

*ఆడది అబల కాదు ఆదిపరాశక్తి అని నేటి మహిళలు నిరూపిస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకోవడంలో పురుషులకు ఏ మాత్రం తీసిపోమని చాటి చెబుతున్నారు. ఇప్పటికే రాజకీయరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు అధికార రంగంలోనూ ప్రభుత్వ సేవలలో దూసుకు పోతున్నారు. రాజకీయాలలో రిజర్వేషన్‌ల ద్వారా అధికార అందలాలను మహిళలు దక్కించుకుంటున్నారు. జిల్లాలో ఆరు మున్సిపాల్టీలుంటే అన్నింటిలోనూ మహిళలే ఛైర్‌పర్సన్‌లుగా ఉన్నారు.*





ఇక ప్రభుత్వ శాఖలలో చూస్తే మహిళలదే పెత్తనం అవుతుంది. జిల్లా కలెక్టర్‌గా జానకి బాధ్యతలు స్వీకరించారు. గత మూడు దశాబ్దాల కాలంలో చూస్తే జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మూడో మహిళ జానకి. 1983ప్రాంతంలో సుజాతారావు ఈ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1999ప్రాంతంలో శ్రీలక్ష్మి కలెక్టర్‌గా పనిచేయడం జరిగింది. ఇప్పుడు జానకి వచ్చారు. ఇక ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా మహిళే ఉన్నారు. జేసీగా రేఖారాణి తనదైన పనితీరుతో దూసుకెళుతున్నారు. ప్రపంచమంతా క్రికెట్ దేవుడుగా కొలిచే సచిన్‌టెండూల్కర్‌నే జిల్లాకు తీసుకొచ్చి ఆయన చేత ఒక గ్రామాన్నే అభివృద్ధి చేయిస్తున్న ఘనకీర్తి రేఖారాణిది.

డ్వామా పిడిగా గౌతమి గత కొంత కాలంగా సమర్థవంతంగా పనిచేస్తున్నారు. ఐసిడిఎస్ పిడిగా విజయలక్ష్మి బాగా పనిచేసారు. బాలభవన్ డైరెక్టర్‌గా సుభద్రాదేవి సేవలందిస్తున్నారు. ఇక ఇటీవల జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా సంధ్యారాణి, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిగా భారతిరెడ్డిలు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిణిగా వాణి పని చేస్తున్నారు.

జిల్లాలోని ముఖ్యమైన ప్రభుత్వశాఖలకు మహిళలే అధికారులుగా ఉంటున్నారు. సమర్థవంతంగా పనిచేస్తూ మహిళల సత్తాను లోకానికి చాటుతున్నారు.

# కోవూరు షుగర్స్... అంతే సంగతులు



దశాబ్దాల కాలం పాటు జిల్లా చెరకు రైతాంగానికి సేవలందించిన కోవూరు సహకార చక్కెర కర్మాగారం పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షు మాదిరిగా మారుతోంది. ముఖ్యంగా తెలుగుదేశం అధికారంలోకి వచ్చిందంటే ఈ ఫ్యాక్టరీకి మూడినట్లవుతుంది. గతంలోనూ చంద్రబాబు హయాంలోనే ఈ ఫ్యాక్టరీని మూతేశారు. దివాలాపడ్డ పరిశ్రమల జాబితాలో చేర్చి ఫ్యాక్టరీని, స్థలాన్ని వేలానికి కూడా పెట్టారు. అయితే 2004లో వై.యస్. ముఖ్యమంత్రి కావడంతో ఈ కర్మాగారానికి పునర్జన్మ లభించినట్లయ్యింది. మూతపడ్డ ఈ పరిశ్రమను ఆరోజు వై.యస్. తెరిపించారు. చెరుకు రైతులకు పాత బకాయిలు చెల్లించడమే కాక ఫ్యాక్టరీలో మళ్లీ ఉత్పత్తి మొదలయ్యేలా చేశారు. ఒడిదుడుకులున్నా కూడా గత పదేళ్లగా ఈ ఫ్యాక్టరీలో క్రషింగ్ జరుగుతూ వచ్చింది. కాని ఇప్పుడు ఫ్యాక్టరీలో క్రషింగ్ చేసే పరిస్థితి లేకుండాపోయింది. ఫ్యాక్టరీ నడిచేందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయడంలేదు. ఫ్యాక్టరీలో ఇప్పటికే పాత బకాయిలు 4.41 కోట్లున్నాయి. సిబ్బందికి జీతాల క్రిందే 6కోట్లు దాకా చెల్లించాలి. ఇక క్రషింగ్ మొదలుపెట్టాలంటే ఫ్యాక్టరీలో మరమ్మత్తులకు మరో నాలుగు కోట్ల రూపాయల దాకా ఖర్చు పెట్టాలి. ఈమధ్య జన్మభూమి కార్యక్రమంలో కోవూరుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ఫ్యాక్టరీని నడిపించడానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాని ఇంతవరకు ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయలేదు. మరోపక్క ఫ్యాక్టరీ పరిధిలో టన్నుల దాకా చెరుకు ఉత్పత్తి వచ్చింది. డిసెంబర్‌లో ఫ్యాక్టరీలో క్రషింగ్ జరిగే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు చెరుకును నాయుడుపేటలోని ఎంపీ షుగర్స్‌కు తరలిస్తున్నారు. కోవూరు ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బంది జీతాలు రాక, జీవితాలు నడవక ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు పోతున్నారు.

# ప్రతిభా పురస్కారం

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్, హైదరాబాద్ వారు ఇటీవల హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి శ్రీమతి ములుగు లక్ష్మీ మైథిలికి కవితా రంగంలో ప్రతిభాపురస్కారాన్ని, పారితోషికం రూ.1116/-లును, ప్రముఖ సాహితీవేత్త ద్వానాశాస్త్రి, సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, టివి నటుడు ఉదయభాస్కర్, జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గుదిబండి వెంకటరెడ్డి, ప్రపంచ రికార్డుల గ్రహీత, శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షులు డా॥ కళా వెంకటదీక్షితులు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.



# నెల్లూరు కబుర్లు

## వాన కుమ్మేసింది

నెల్లూరుజిల్లాకు ఇక వర్షాలే లేవనుకుంటున్న తరుణంలో 9వ తేదీ అర్ధరాత్రి నుండి వాన కుమ్మేసింది. మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి నెల్లూరు నగరం జలమయమైంది. వానొస్తే నెల్లూరు ఏ విధంగా తయారవుతుందో వేరేగా చెప్పక్కర్లేదు. ఎక్కడికక్కడ డ్రైనేజీ బ్లాక్ కావడంతో రోడ్లే కాలువలయ్యాయి. ఏ రోడ్లో చూసినా అడుగు నుండి రెండడుగుల ఎత్తున జలప్రవాహం కనిపించింది. ఇక యధావిధంగా నగరంలోని అండర్‌బ్రిడ్జిలన్నీ చేపలచెరువులుగా మారాయి.

## కొట్లాడుకున్న కమ్యూనిస్టులు

క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే సీపీఐ పార్టీలో కాంగ్రెస్ సంస్కృతి చోటుచేసుకుంది. ఆదివారం నెల్లూరునగరంలోని రామకోటయ్య భవనంలో ఏఐటియుసి నగర మహాసభ జరిగింది. ఈ సభలో పార్టీ నగర కార్యదర్శి పదవి కోసం పసుమర్తి నాగేశ్వరరావు(మార్కెట్ నాగేశ్వరరావు), న్యాయవాది అరిగెల నాగేంద్రసాయి పోటీపడ్డారు. పార్టీలో ఇంకో వర్గమైన మునీర్ వర్గీయులు నాగేంద్రసాయిని ప్రతిపాదించాలని నిర్ణయించుకున్నారు. దీంతో సభ జరుగుతున్న సమయంలో నాగేశ్వరరావు వర్గీయులు మునీర్ అతని అనుచరులపై దాడికి దిగారు. దీంతో పెద్ద ఎత్తున రభస చోటుచేసుకుంది. మునీర్‌తో పాటు మరో ఇద్దరు కార్యకర్తలు గాయపడ్డారు. త్రీటౌన్ పోలీసులొచ్చి పరిస్థితిని అదుపుచేశారు. దాడికి పాల్పడ్డ నాగేశ్వరరావును సిపిఐ పార్టీ నుండి సస్పెండ్ చేశారు.

# మాటలతో మంటలు

### వైకాపా నేతలు Vs మంత్రి అనుచరులు



జిల్లా నుండి మున్సిపల్ మంత్రిగా వున్న పి.నారాయణపై నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శల దాడికి శ్రీకారం చుట్టారు. నారాయణ రాజకీయ నాయకుడు కాదు, వర్గనాయకుడూ కాదు. విద్యావేత్తగా ఆయన మాస్టర్ డిగ్రీలు, గోల్డ్‌మెడల్స్ పొంది వున్నా రాజకీయ విద్యలో మాత్రం మొద్దబ్బాయ్ అనుకోవచ్చు. రాజకీయంగా ఆయనకు అంతగా మేధస్సు లేదు కాబట్టే ఇంతకాలం ప్రతిపక్ష నాయకులు కూడా ఆయన మీద విమర్శలకు దిగలేదు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాత్రం మంత్రిని వదలడం లేదు. మంత్రివై ఆరు నెలలయ్యింది. నారు పోసావా, నీరు పెట్టావా, దుక్కిదున్నావా, తట్ట మట్టిపని చేసావా, నెల్లూరు అభివృద్ధికి రూపాయి పావలా అన్నా తెచ్చావా అంటూ పదేపదే ప్రశ్నిస్తున్నారు.

తెలుగుదేశం ప్రభుత్వంలో నెంబర్ 2గా వున్న మా అయ్యవారినే వేలెత్తి చూపుతావా, మా అయ్యవారి అనుభవమంత లేదు నీ వయసు అంటూ తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శీనయ్య, కిలారి వెంకటస్వామి నాయుడు లాంటి వాళ్లు ప్రతి దాడికి దిగారు. మా నారాయణను విమర్శించే క్వాలిఫికేషన్ అనిల్‌కు లేదని, ఆయన విమర్శలు కట్టిపెట్టి మంత్రి సహకారంతో నెల్లూరు అభివృద్ధికి కృషి చేయాలంటూ ఉచిత సలహాలిచ్చారు.

అనిల్‌పై తెలుగు తమ్ముళ్లు చేసిన విమర్శలను ఒకరోజు ప్రెస్‌మీట్లు పెట్టి అటు గ్రామీణఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటు వైకాపా నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్‌లు ఖండించారు. మంత్రిపై అనిల్ చేసిన విమర్శలలో తప్పేముందో చూపాలని, నిజాలు మాట్లాడితే నిష్ఠూరంగానే ఉంటుందని వీళ్లు దెప్పిపొడిచారు. మొత్తానికి మంత్రి అనుచరులకు వైకాపా నేతలకు మధ్య మాటల మంట రేగింది. జిల్లా రాజకీయాలలో ఇదొక సందడిగా వుంది.

## మిన్నంటిన 'రత్నం' క్రీడా సంబరాలు



ఈ నెల 6వ తేదీ నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో నెల్లూరులోని డా॥ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ సరస్వతినగర్, డైకాన్‌రోడ్డు, వేదాయపాళెం, రిత్విక్ ఎన్‌క్లేవ్, గాయత్రినగర్, మాగుంట లే అవుట్‌కు సంబంధించిన ప్లేక్లాసు, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులచే 'స్పోర్ట్స్ డే'ను కిడ్స్ అథ్లెటికా పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ స్పోర్ట్స్‌డేలో ప్లేక్లాసు చిన్నారులు ప్లే మెటీరియల్స్‌తో పెరేడ్‌ను, ఎల్‌కెజి చిన్నారులు మార్చ్‌ఫాస్ట్‌ను మరియు యుకెజి చిన్నారులు డ్రిల్‌ను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్‌రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు చిన్నారులను అభినందిస్తూ ఎంతో ఉత్సాహంతో చిన్నారులు 'స్పోర్ట్స్‌డే'లో పాల్గొనడం వారికి చిన్నవయస్సు నుండే క్రీడల పట్ల గల అభిమానాన్ని తెలియజేస్తుందని, చిన్న మొక్కలే మహావృక్షాలవుతాయి అన్నట్లు ఈ చిన్నారులే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగవచ్చని అన్నారు. చదువుతో పాటు క్రీడలు విద్యలో ఒక భాగమని తల్లిదండ్రులు చిన్నారులను క్రీడలలో కూడా పాల్గొనేటట్లు ప్రోత్సహించాలని కోరారు. క్రీడలకు తగిన సమయాన్ని కేటాయిస్తున్న ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులను హర్షధ్వానాల మధ్య అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో చిన్నారులు, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం ఈ విద్యాసంవత్సరంలో చిన్నారులకు పాఠశాలలో నిర్వహించిన రన్నింగ్‌రేస్, కంగారు జంపింగ్, మ్యాజిక్ వాటర్, కిక్‌బాల్, పిక్ ది థింగ్స్, రోలింగ్ దమ్మాబ్ మొదలైన క్రీడలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతి ప్రదానం జరిగింది.

ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్‌రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, కిడ్స్ ఇంటర్నేషనల్స్ ప్రిన్సిపాల్స్ లక్ష్మి, కళ్యాణి, మణిమాల, క్రిష్ణయ్య, సుధ, లతలతో పాటు ఉపాధ్యాయులు, చిన్నారులు, తల్లిదండ్రులు ఆనందోత్సాహాల మధ్య పాల్గొన్నారు.

## జానకిరామ్‌కు నివాళి



నందమూరి హరికృష్ణ తనయుడు జానకిరాం మృతికి చింతిస్తూ నందమూరి అభిమానులు నెల్లూరులోని నర్తకి సెంటర్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళు లర్పించారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ నగర అధ్యక్షులు కె.గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, నందమూరి అభిమానులు ఎం.సుధాకర్, కరణం రమేష్, ఎ.భాషా, బి.రమేష్, ఎస్.కె.సుభాన్, కె.సాగర్, కార్తీక్, కె.మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్‌ఛార్జి సిపిఓగా వెంకయ్య

జిల్లా ప్రణాళికా సంఘం ఇన్‌ఛార్జి అధికారిగా కె.టి వెంకయ్య ఈ నెల 6న బాధ్యతలను చేపట్టారు. ఒంగోలు సిపిఓగా వున్న వెంకయ్య ఇక్కడికి బదిలీ అయి వచ్చారు. కలెక్టరేట్‌లోని సిపిఓ కార్యాలయంలో ఆయన తన బాధ్యతలను చేపట్టారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వెంకయ్యకు 'లాయర్' అభినందనలు.

## పబ్లిక్ ఫంక్షన్‌లకు పోలీసు హాల్

నెల్లూరు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ఉన్న ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలు ఇకమీదట పబ్లిక్ ఫంక్షన్లకు బాడుగకు అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు కేవలం పోలీసుశాఖకు సంబంధించిన సమావేశాలు, గ్రీవెన్స్‌సెల్ తదితర కార్యక్రమాలు ఇక్కడ జరిగేవి. ఇకపై పుట్టినరోజు, పెళ్లిరోజు, సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఒక్కరోజుకు రూ.5,500 బాడుగ నిర్ణయించారు. మెయింటెనెన్స్ ఖర్చులకు రూ.500లు, విద్యుత్ యూనిట్‌కు రూ.15లు చొప్పున వినియోగదారుడు చెల్లించాల్సి వుంది. బాడుగలు ద్వారా వచ్చే నిధులను పోలీసుల సంక్షేమానికి, కాన్ఫరెన్స్‌హాలు మెయింటెనెన్స్‌కు వినియోగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## మోటివేటర్ల శిక్షణా శిబిరం

రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తసేకరణ, రక్తదాతలకు అవగాహన కార్యక్రమాల్లో నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధి 2013-14 సంవత్సరానికి ప్రథమ స్థానంలో నిలిచిందని రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదాతలకు, రక్తదాన ప్రేరేపకులకు ఈ నెల 27న శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసామన్నారు.

## చందన బ్రదర్స్ వార్షికోత్సవ ఆఫర్లు




చందన బ్రదర్స్ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తమ షాపింగ్ మాల్‌లో పండుగ ఆఫర్లు అందజేస్తున్నామని చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 6న ఆయన నగరంలో వున్న తమ షాపింగ్ మాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ పండుగల నెల సందర్భంగా అన్ని రకాల వస్త్రాలను తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నామని తెలిపారు. పెళ్లి పట్టుచీరలు రూ.9వందల నుంచి రూ.2 లక్షలు దాకా ఖరీదు చేసేవి అందుబాటులో వున్నాయన్నారు. కంచి, ధర్మవరం, ఆరణి, గద్వాల్ ఇలా వేలాది రకాల చీరలు ఇక్కడ అందుబాటులో వుంచామన్నారు. ఈ ఆఫర్లే కాకుండా, ప్రతి రూ. 5 వందల కొనుగోలుపై బహుమతులు కూడా వుంటాయని పేర్కొన్నారు ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీ యాడ్స్ అధినేత పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సేవాభావంతో వైద్యసేవలందించాలి

నర్సింగ్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావంతో వైద్యసేవలు అందించాలని నారాయణ హాస్పిటల్స్ సిఇఓ డా॥ విజయమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చింతారెడ్డిపాలెంలో ఉన్న నారాయణ నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో 2010-14 మధ్యకాలంలో నర్సింగ్ విద్యనభ్యసించిన విద్యార్థులకు వీడ్కోలు, 2014-18 బ్యాచ్‌కు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయమోహన్‌రెడ్డి జ్యోతిప్రకాశనం గావించి మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు అత్యున్నత సేవల ద్వారా తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. నర్సింగ్ కళాశాల డీన్ డా॥ ఇందిర మాట్లాడుతూ నారాయణ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌ను సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. అనంతరం నర్సింగ్ వీడ్కోలు విద్యార్థుల్లో ప్రతిభ కనపరచిన ప్రీతా ఆర్ నాయర్, నీతూరాజన్, జి.రామలక్ష్మమ్మలను స్వర్ణపతకాలు, ప్రశంసాపత్రాలతో అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నారాయణ నర్సింగ్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## వైభవంగా దత్తపౌర్ణమి

దత్తపౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 6న నగరంలోని పలు సాయినాధుని మందిరాల్లో ఎంతో వైభవంగా దత్తపౌర్ణమిని నిర్వహించారు. బాలాజీనగర్‌లోని పద్మావతినగర్‌లో వున్న సాయిదర్బార్ (అద్దాల సాయిబాబా మందిరం)లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, దత్తాత్రేయస్వామి వ్రతం కన్నులపండువగా నిర్వహించారు. సాయిమందిరం నిర్వాహకులు మధుసూదనరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి, ఈ వేడుకలను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా, అయ్యప్పగుడి సమీపంలోని నాగసాయి మందిరంలోనూ, చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని సాయిసదన్‌లోనూ, నిప్పో కూడలి వద్ద వున్న సాయిమందిరంలోనూ, ఏసి మార్కెట్ సమీపంలోని సాయిబాబా మందిరంలోనూ, దత్తాత్రేయమఠంలోనూ, నవాబుపేటలోని శ్రీ సాయినాధుని మందిరంలోనూ దత్తపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి.

# కృష్ణపట్నం పోర్టు సహకారంతో... సుందర సింహపురి



జాతీయరహదారి నుండి అయ్యప్పగుడి మీదుగా నగరంలోకి ప్రవేశించే మార్గంలో ఆర్చి నమూన




జాతీయరహదారి నుండి చింతారెడ్డిపాలెం క్రాస్ మీదుగా నగరంలోకి ప్రవేశించే మార్గంలో ఆర్చి నమూన

**కృష్ణపట్నం పోర్టు... ఇదొక ప్రైవేట్ వ్యాపార సంస్థే కావచ్చు. కాని ఈరోజు నెల్లూరుజిల్లాకు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చింది. ఒకప్పుడు నెల్లూరు జిల్లా అంటే శ్రీహరికోటలోని షార్ సెంటర్ గుర్తొచ్చేది. ఇప్పుడు దాని పక్కన కృష్ణపట్నంపోర్టు కూడా చేరింది.**

ఈరోజు ఎన్నో విదేశీ కంపెనీలు నెల్లూరుజిల్లాలో తమ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయంటే కారణం ఇక్కడ వస్తు ఉత్పత్తికి, దిగుమతికి పోర్టు అనుకూలంగా వుంది. కృష్ణపట్నం పోర్టు రాబట్టే ముత్తుకూరు, టి.పి. గూడూరు, చిల్లకూరు, నెల్లూరురూరల్, ఇందుకూరుపేట మండలాలలో ఎంతో మంది రైతులు బాగుపడ్డారు. పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కూడా లభించాయి.

నెల్లూరుజిల్లా అభివృద్ధికి ఈ విధంగా కారణమైన కృష్ణపట్నంపోర్టు కంపెనీ నెల్లూరు నగర అభివృద్ధిలో కూడా ప్రత్యక్ష పాత్ర పోషించేందుకు ముందుకు రావడం అభినందనీయం. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కెపిసిఎల్ ఆధ్వర్యంలో ఇప్పటికే లెక్చరర్స్ కాలనీ, మాగుంట లేఅవుట్ ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటుతున్నారు. లెక్చరర్స్ కాలనీలోని రిజర్వ్ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయడానికి కూడా కెపిసిఎల్ నడుం కట్టింది. గ్రీన్ నెల్లూరు పేరుతో నగరమంతా కూడా మొక్కలు నాటి నెల్లూరు రూపురేఖలనే మార్చడానికి కెపిసిఎల్ సన్నద్ధంగా వుంది.

నెల్లూరు దర్గామిట్టలోగల ఆర్ అండ్ బి అతిథి గృహం మరమ్మత్తు పనులను కూడా కెపిసిఎల్ చేపట్టడం విశేషం. విఐపిలకు ఎన్నో ఏళ్ల పాటు సేవలందించిన ఆర్ అండ్ బి అతిథిగృహం బాగా పాతబడిపోయింది. 5ఏళ్ల క్రితం బారాషహీద్ దర్గా సమీపంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో పినాకిని అతిథి గృహాన్ని అందంగా నిర్మించారు. దాంతో సీఎం, మంత్రులు, ఇతర విఐపిలు కూడా ఈ అతిథిగృహానికే రాసాగారు. ఆర్ అండ్ బి అతిథిగృహాన్ని పెద్దగా వాడకుండా వదిలేసారు. కాని మరమ్మత్తులు చేస్తే విఐపిలకు ఆర్ అండ్ బి అతిథి గృహమే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ అతిథి గృహానికి మరమ్మత్తులు చేసి మళ్లీ ఉపయోగించుకునేందుకు వీలుగా కెపిసిఎల్ పనులు చేపట్టింది. త్వరలో సరికొత్త హంగులతో ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ అతిథులకు ఆతిథ్యం ఇవ్వబోతుంది.

నెల్లూరును సుందరనగరంగా మార్చడానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మాస్టర్‌ప్లాన్ రూపుదిద్దుకుంటుంది. ఈమేరకు జాతీయ రహదారి నుండి నగరంలోకి ప్రవేశించే రెండు మార్గాలు (అయ్యప్పగుడి, చింతారెడ్డిపాలెం క్రాస్) వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆధునిక హంగులతో డిజైన్ చేసిన ఈ స్వాగత ద్వారాలను నిర్మించేందుకు కృష్ణపట్నం పోర్టు ముందుకొచ్చినట్లు సమాచారం. ఇలా వ్యాపారంలోనే కాదు తమ వ్యాపారాభివృద్ధికి కారణమైన నెల్లూరుజిల్లా అభివృద్ధిలో కూడా కెపిసిఎల్ భాగస్వామ్య పాత్ర పోషిస్తుండడం అభినందనీయం.

# రుణమాఫీ.. చారిత్రాత్మకం

## మాట నిలబెట్టుకున్న చంద్రబాబు : బీద రవిచంద్ర



రుణమాఫీ ఒక చారిత్రాత్మకమైన సంఘటన అని, దేశంలోనే తొలిసారిగా ఒక రాష్ట్రప్రభుత్వం ఇంతపెద్దఎత్తున రుణమాఫీ చేయడం ఎంతో విశేషమైన విషయమని, ఆ ఘనత ఒక్క చంద్రబాబు నాయుడుకే దక్కిందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుబు బీద రవిచంద్ర కొనియాడారు.

ఈ నెల 6న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ రుణమాఫీతో చంద్రబాబునాయుడు రైతుల హృదయాల్లో నిలచిపోతారని ఆయన అన్నారు. విభజన తర్వాత రాష్ట్ర ఆర్థికపరిస్థితి అస్తవ్యస్తంగా వున్నా, దాదాపు 16వేల కోట్ల లోటుబడ్జెట్ వున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు, తద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పయనింపజేసేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారని, అయితే కాంగ్రెస్, వైకాపా నాయకులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. అసత్య ప్రచారాలతో సాధించేదేమీ వుండదన్నారు. ఇకనైనా జగన్, కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డిలు చంద్రబాబుపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు, పింఛన్లు అందుతూనే వున్నాయని స్పష్టం చేశారు. వైకాపా, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన అనేకమంది నేతలు టిడిపిలోకి వలసలు వస్తున్నారని, మరో ఆరునెలల్లో ఆ రెండు పార్టీలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆయన అన్నారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణపై స్థానిక వైకాపా నాయకులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పదేపదే అనుచిత వ్యాఖ్యలు, లేనిపోని విమర్శలు చేయడం తగదని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అహరహం పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని చూసి ఓర్వలేక, లేనిపోని విమర్శలు చేయడం సముచితం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, టిడిపి అధికారప్రతినిధి జడ్.శివప్రసాద్, నాయకులు చాట్ల నరసింహారావు, గిరినాయుడు, జలదంకి సుధాకర్; బద్దెపూడి రవీంద్ర, అన్నం దయాకరగౌడ్, ధర్మవరం సుబ్బారావు, మహిళానాయకురాలు అంచల వాణి తదితరులు పాల్గొన్నారు.



# హోంగార్డుల సేవలు అభినందనీయం

**- జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్**

పోలీసులతో పాటు హోంగార్డులు సైతం నిరంతరం ఎంతో శ్రమిస్తూ ప్రజలకు తమ సేవలందిస్తుండడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ ప్రశంసించారు. హోంగార్డ్‌ల 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 6న జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ హోంగార్డుల గౌరవ వందనం అందుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, హోంగార్డులు ఎంతో చిత్తశుద్ధితో, సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన కొనియాడారు. హోంగార్డుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని, వారి రోజువారీ వేతనాన్ని రూ.300కు పెంచడంతో పాటు, వారికి జనతా ఇన్సురెన్స్, ఆరోగ్యభద్రత స్కీమ్‌లను ప్రకటించిందని అన్నారు. ఈ సందర్భంగా, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభను కనుపరుస్తున్న పలువురు హోంగార్డులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. అనంతరం హోంగార్డులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఎఎస్పీ రెడ్డి గంగాధరరావు, డిఎస్పీలు మగ్బూల్, రాంబాబు, బివి రామారావు, ఎల్.చెంచురెడ్డి, హోంగార్డ్ ఆర్ఐ, ఎఆర్ ఆర్ఐలు చిరంజీవి, శ్రీనివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రూ.62కోట్ల రుణాలు మాఫీ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు సహకార సంఘాల ద్వారా రైతుల రుణాలను రద్దు చేసేందుకు 45,624 మంది రైతులను గుర్తించి వీరికి సంబంధించి రూ.150కోట్ల రుణాలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేయగా ప్రభుత్వం 19,642మంది రైతులకు సంబంధించి రూ.62కోట్ల రుణాలను రద్దు చేసేందుకు నిర్ణయించిందని నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్ర సహకారబ్యాంకు సమావేశ మందిరంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మొదటివిడతగా రూ.26కోట్లు రద్దు చేయనున్నామని ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరలోనే ఈ నిధులు రైతులకు అందజేస్తామన్నారు. 449 మంది రైతులు వ్యవసాయం కోసం బంగారుపై రుణాలు పొంది వున్నారని వారిలో 277మంది రైతులకు రూ.9.5కోట్లు రద్దు చేయనున్నామన్నారు. మొదటి విడతగా రూ.2.5కోట్లకు సంబంధించిన నిధులను రైతులకు అందజేస్తామన్నారు.

ఈ సమావేశంలో బ్యాంక్ వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, బ్యాంక్ సిఇఓ కేతి రమణారెడ్డి, డైరక్టర్లు చిట్టమూరు శేషారెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్‌లు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఆస్తులను పరిరక్షిస్తాం



నగరపాలక సంస్థ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు అన్ని విధాలా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ నెల 6న కార్పొరేషన్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరంలో పలుచోట్ల కార్పొరేషన్‌కు చెందిన స్థలాలు, పార్కులు అన్యాక్రాంతం అయినట్లు తెలుస్తోందని, వాటిని పరిశీలించి తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలో, నగరంలోని కార్పొరేషన్ స్థలాల వివరాలను తమకు అందజేయాలని సిటీ ప్లానింగ్ అధికారులను ఆదేశించామని ఆయన పేర్కొన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. నగరంలో పలుచోట్ల ఐలాండ్‌లు, డివైడర్ల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా వుందని, రోడ్ల విస్తరణతో పాటు, అడ్డదిడ్డంగా వున్న ఐలాండ్‌ల నిర్మాణాన్ని పరిశీలించి, ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా వాటిని సవరిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రాభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పురపాలకశాఖ మంత్రి డాక్టర్ నారాయణ అహర్నిశం కృషి చేస్తున్నారని ఆయన అంటూ, రాష్ట్ర అభివృద్ధికి అన్నివిధాలా కృషిచేస్తున్న ముఖ్యమంత్రిపై వైఎస్సార్సీపి నేతలు లేనిపోని విమర్శలు చేయడం దారుణమన్నారు. ప్రతిపక్షాలంటే..ప్రతిదాన్నీ తప్పుపట్టడం కాదని, రాష్ట్ర ప్రగతికి తగు సూచనలు చేయాలని అన్నారు.

# అన్నదాతలకు అండగా నిలబడదాం

## --- జడ్పీ సమావేశంలో సభ్యుల వాదన ---



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

జిల్లాలో వర్షాలు సరిగా కురవకపోవడంతో, ఈ సీజన్‌లో పంటలు ఎలా పండించుకోవాలో తెలియక రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అటు సాగునీటి కోసం, ఇటు త్రాగునీటి కోసం రైతులు విలవిల్లాడిపోతున్నారు. జిల్లాలో తీవ్రమవుతున్న కరువు పరిస్థితులపై చర్చ జరగాలి.. అన్నదాతలకు భరోసా ఇవ్వాలంటూ.. పలువురు జడ్పీ సభ్యులు పట్టుబట్టారు. ఈ నెల6న జరిగిన జడ్పీ సమావేశం వాడిగా..వేడిగా సాగింది. అయితే, ఈ సమావేశానికి జిల్లామంత్రి డాక్టర్ పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం.జానకి, జేసి రేఖారాణి అధికారిక పర్యటనల్లో భాగంగా వారు హైదరాబాద్‌కు వెళ్ళివుండడంతో, ఎంతో ముఖ్యులైన వీరు లేకుండా అభివృద్ధి పనుల సమీక్ష ఎలా చేస్తారని సభ్యులు ప్రశ్నించడంతో సమావేశంలో అయోమయ పరిస్థితి ఏర్పడింది.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తదితరులు తొలుత ఈ పరిస్థితుల్లో సభను వాయిదా వేయాలని తర్జనభర్జనలు పడినా, ఆ తర్వాత ఎలాంటి కీలకమైన నిర్ణయాలు లేకుండా మధ్యాహ్నం దాకా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, జిల్లాలో సాగునీటి సమస్య, యూరియా కొరత వంటి వ్యవసాయ ప్రధాన అంశాలపై వాదోపవాదాలు జరిగాయి. అసలు అజెండాలో ముఖ్యమైన అంశాలేమీ లేవని, ఒకవైపు జిల్లాలోని అనేకప్రాంతాల్లో వున్న చెరువులు చుక్కనీరు లేక ఎండిపోయివున్నాయని, సాగునీరు లేక రైతుల అవస్థలు వర్ణనాతీతంగా వున్నాయని, జిల్లాను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించేలా ఈ సమావేశంలో తీర్మానించాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. కొడవలూరు జడ్పీటిసి సభ్యుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో అవినీతి రాజ్యమేలుతోందని విమర్శించారు. అధికారులు మాట వినడం లేదన్నారు. ఇసుక మాఫియా ఆగడాలకు అంతే లేకుండాపోతోందన్నారు. ఇసుకను అక్రమంగా తరలించుకుపోయి కొందరు కోట్లు సంపాదిస్తున్నా పట్టించుకునే నాధులే లేరని ఆరోపించారు. ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, తాను జడ్పీ ఛైర్మెన్‌గా వున్నప్పుడు జడ్పీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు రాకుండా కొందరు ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారని, అయినా కష్టపడి పనులు చేయించినా పనులు నమోదు చేయలేదని, దీంతో ఆ పనుల అంచనాలన్నీ పెరిగిపోయాయని అంటూ, ఇందుకు కారణమైన వారిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులు దాపురించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ పాలకులు రాక ముందు, జడ్పీలో అధికారులు ఖర్చుచేసిన కోట్లాదిరూపాయలకు లెక్కలు తేల్చాలని కోవూరు జడ్పీటిసి సభ్యులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి డిమాండ్ చేశారు. మండలాల్లో జడ్పీటిసిలకు ప్రత్యేక గదులు కేటాయించే విషయాన్ని ఏం చేశారని సూళ్ళూరుపేట జడ్పీటిసి సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా వుందని పలువురు ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా వుంటే, మరికొందరు ఇదే అదనుగా ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో అధికధరలకు విక్రయిస్తున్నారంటూ డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ధ్వజమెత్తారు.

### జోరుగా ఇసుక అక్రమరవాణా : ఎమ్మెల్యేల ఆగ్రహం

జిల్లాలో ఇసుక అక్రమరవాణా జోరుగా జరుగుతోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళాసంఘాల పేరుతో కొంతమంది బినామీలు ఈ అక్రమరవాణాకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. అయితే, అందుకు కురుగొండ్ల మాట్లాడుతూ, ఒక లక్ష్యంతో మహిళలకు సిఎం ఇసుక బాధ్యతలను అప్పగించారని, అయితే దాని అమలులో అధికారుల అసమర్థతతో లోపాలేమైనా వుంటే వాటిని వెంటనే సరిదిద్దాలన్నారు.

ఈ సమావేశంలో ఇంకా ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండ్లపల్లి శ్రీనివాసులు, జడ్పీ వైస్ ఛైర్మెన్ శిరీష తదితరులతో పాటు జడ్పీటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



డా॥ బి.ఆర్.అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

## గూడూరు డివిజన్ వార్తలు

### అత్యాధునిక వసతులతో

# రోటరీ స్వర్గధామం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న స్వర్గధామ కమిటి

గూడూరు పట్టణంలోని ధూర్జటినగర్ ప్రాంతంలోని రోటరీ స్వర్గధామంను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దినట్లు స్వర్గధామ కమిటి ఛైర్మెన్ కొణిదల మునిగిరీష్ తెలిపారు. ఇటీవల ఇక్కడ సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 4లక్షలతో గ్యాలరీ, కర్మక్రతువుల మండపం నిర్మించారు. నారాయణ కళాశాల ఇచ్చిన రూ. 2లక్షలతో ప్రహరీగోడ, స్వర్గధామం నిధులు రూ. 2లక్షలతో గార్డెన్, మరికొన్ని వసతులు కల్పించామన్నారు.

ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు దయాకరరెడ్డి, జానకి రామిరెడ్డి, దశరథరామిరెడ్డి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, రొటేరియన్లు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, రఘురామిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, కె.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం విద్యార్థులకు

# పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న రియాజ్ అహ్మద్

గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ఈ నెల 7వ తేదీ మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యాన పేదముస్లిం విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ నెట్‌వర్క్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పేద విద్యార్థులు, వృద్ధులను ఆదుకునేందుకు నెట్‌వర్క్ కృషి చేస్తోందన్నారు. అలాగే వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులకు డాక్టర్ నౌషాద్ దంతవైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ నెట్‌వర్క్ ప్రతినిధులు కరిముల్లా, రహంతుల్లా, నాజర్, షంషీద్, రమిజ, మగ్దుమ్, యాసఫ్, ఎంఈఓ ఇస్తాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని తపాలా కార్యాలయం, గడియారస్థంభం కూడలి, ఎల్‌ఐసి కార్యాలయం వద్ద 6వ తేదీ అంబేద్కర్ 58వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అరవ పార్వతయ్య, తపాలా సూపరింటెండెంట్ రమణయ్య, ఉద్యోగులు రవి, గోవిందనాయక్, రంగనాథం, సుబ్బరామయ్య, శ్రీనివాసరావు, చల్లా రమణయ్య, భాస్కర్‌గౌడ్, ముత్యాలయ్య, కంకణాల పెంచలనాయుడు, ఎల్‌ఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ వరప్రసాద్

గూడూరు రైల్వేస్టేషన్‌లోని సమస్యలపై రైల్వే అధికారులతో 6వ తేదీ సాయంత్రం ఎంపి వరప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను తెలుసుకున్నారు. స్టేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండటంతో అదనంగా ప్లాట్‌ఫారాలు కావాలని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే నాలుగోప్లాట్‌ఫారం మంజూరైందని, కానీ పనులు నేటికీ ప్రారంభం కాలేదని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. రైల్వే కాలినడక వంతెన వద్ద ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తన దృష్టికి తీసుకొస్తే కేంద్ర రైల్వేమంత్రికి వివరించి తగు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వైకాపా రాష్ట్ర నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# మైథిలిలో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మైథిలి

గూడూరు పట్టణంలో ఐసిఎస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న మైథిలి ఆసుపత్రిలో లింగంగుంట సుందరరామయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 7వ తేదీ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మైథిలి గర్భిణులు, రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. నిరుపేదలు ఈ శిబిరంలో పాల్గొని వైద్యసాయం పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు రమణబాబు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న గురప్ప

గూడూరులోని కోర్టు ఆవరణలో 6వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడో అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప మాట్లాడుతూ సత్వర న్యాయం శాశ్వత పరిష్కారమన్నారు. కేసులను రాజీ చేసుకోవడం రాజమార్గమన్నారు. రాజీతో ఇరువర్గాల మధ్య సఖ్యత, స్నేహం కుదురుతుందన్నారు. మొత్తం నాలుగు బెంచీలను ఏర్పాటు చేశామని, ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నెలరోజుల నుంచి ఈ అదాలత్ కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో శాంతి నెలకొల్పడానికి అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొత్తం కేసులు 428పరిష్కరించారు. వాటిలో క్రిమినల్ 291, ఆర్థికనేరాలు 68, భరణం 2, సివిల్ 25, ఎస్సీ,ఎస్టీ 30, గృహ హింస 12 కేసులున్నాయి. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఏడుకొండలు, దివాకర్, సాయిరాం, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తివ్యాపారాలలో కొద్దిపాటి అభివృద్ధి, సామాన్య ఆదాయముంటుంది. ఖర్చులు బాగా పెరుగుతాయి. బంధువర్గాల రాకపోకలు, ప్రభుత్వ అనుమతులలో జాప్యం జరుగుతుంది. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమపడవలసి వస్తుంది. అధికారులకు స్థానమార్పు, ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. బంధువుల కారణంగా కుటుంబవ్యవహారాలలో సమస్యలు వస్తాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పనులు అనుకూలంగా జరుగుతున్నా ఎక్కువ టెన్షన్‌గా ఉంటుంది. కొత్త పథకాలు, కొత్త ఆలోచనలతో వ్యాపారములందు ముందుకు సాగుతారు. ఆదాయం బాగుంటుంది. వృత్తిపరంగా బాగా రాబడి ఉంటుంది. కోర్టు కేసులు, స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూలత ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలుంటాయి. ఇతరులకు సహాయపడతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఇంట, బయట వ్యవహారాలలో ఆలోచన చేసి నిర్ణయాలు చేయండి. తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. వృత్తివ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం బాగుండినా ఖర్చులు కూడా తగినట్లుగా ఉంటాయి. వృత్తిజీవనం కలవారికి గుర్తింపు అవకాశాలు పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలలో ఆలస్యం జరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. వృత్తి నిర్వహణలో విశ్రాంతి ఉండదు. సాంఘిక కార్యక్రమాలలో పాల్గొనడం, శుభకార్యాలలో పాల్గొన్నందున ఖర్చులు పెరగడం ఉంటుంది. ఉద్యోగులకు పని సామర్థ్యం గుర్తింపు ఉంటుంది. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. షేర్లు నిరుత్సాహం కలిగించవచ్చును.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 12.11.2014 నుండి**
**తేది. 18.12.2014 వరకు**

ఈ వారము మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని రవి బుధులు, 13తేది నుండి ధనుస్సులో బుధుడు మరియు 16తేది నుండి ధనుస్సులో రవి, ధనుస్సులో శుక్రుడు, మకరంలో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 16 మంగళవారము సాయంకాలము ధనుఃసంక్రమణం, పండగ నెల ప్రారంభము.

### ముహూర్తములు

తేది 12 శుక్రవారము ఉదయము గంట 8.26కు ధనుర్లగ్నమున వివాహ వ్యాపార గృహారంభములు

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | షష్ఠి | రా॥గం.12.08వ॥ |
| తేది. 13 | శని | సప్తమి | రా॥గం.2.32వ॥ |
| తేది. 14 | ఆది | అష్టమి | రా॥గం.4.38వ॥ |
| తేది. 15 | సోమ | నవమి | పూర్తిగ |
| తేది. 16 | మంగళ | దశమి | పూర్తిగ |
| తేది. 17 | బుధ | దశమి | ఉ॥గం.7.47వ॥ |
| తేది. 18 | గురు | ఏకాదశి | ఉ॥గం.8.46వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆకర్షణీయ పథకాలతో వ్యాపారంలో ముందుకు సాగుతారు. వ్యాపారులకు వృత్తి జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. పెండింగ్‌లోగల పనులు సానుకూలం కాగలవు. స్థిరాస్తుల వ్యవహారాలు, కొత్త పెట్టుబడులు వాయిదా వేయండి. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి. వివాహాది శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. షేర్లు లాభిస్తాయి. విలువైన వస్తువులు కొంటారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆగిపోయిన పనులు కొనసాగుతాయి. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్ర పనులందు జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. వృత్తి వ్యాపార వర్గాల వారికి అభివృద్ధి బాగుండి, ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో పరిస్థితులు అనుకూలిస్తాయి. ఉద్యోగులు బాధ్యతలందు జాగ్రత్త పడాలి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించే సమయం.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త వ్యాపారాలు, నూతన పెట్టుబడులు వాయిదా వేయండి. ఎంత సమర్థతతో వ్యవహారాలు నడిపినా ఇబ్బందులు ఎదుర్కొనవలసి రావచ్చును. రావలసిన బాకీలు కొంతమేరకు లభిస్తాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. ఆశించిన ఆదాయం లేకపోగా ఖర్చులు పెరుగుతాయి. కోర్టుకేసులు వాయిదాపడతాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయానికి సమానంగా ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో ఎవరిని తక్కువగా అంచనా వేయవద్దు. ముఖ్యమైన అవసరమైన వ్యక్తులను కలుసుకొంటారు. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. తొందరపాటు పనులు, మాటలు తగ్గించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపార రంగాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సభ్యుల వల్ల చిన్నచిన్న సమస్యలు ఎదుర్కొనవలసి రావచ్చును. కొత్త కాంట్రాక్టులు, ఏజెన్సీలు, లీజులు లభించగలవు. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా మెలగండి. ముఖ్యమైన పనులు సొంతంగా నిర్వహించండి. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులు ఇంకా బాగా శ్రమపడాలి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అదనపు సంపాదనా ప్రయత్నాలు సాగిస్తారు. ఆదాయం తృప్తికరంగానే ఉండినా, చేసే ఖర్చులపై అదుపు ఉండదు. కమీషన్ ఏజెంట్లు, ఆస్తి వ్యవహారాలు నడిపే మధ్యవర్తులకు ఆర్థికంగా బాగుంటుంది. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. కుటుంబ వ్యక్తుల వల్ల స్వల్ప చిక్కులుంటాయి. నిరుద్యోగులకు అవకాశాలు దొరకవచ్చును.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అవకాశాలు, ప్రయత్నాలు శ్రమ లేకుండా లభిస్తాయి. ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలను సమర్థవంతంగా నడుపుతారు. వృత్తి జీవనం కలవారికి రాబడి, మంచి అవకాశాలుంటాయి. చిన్న వ్యాపారులకు, కమీషన్ ఏజంట్లకు తృప్తికరమైన ఆదాయం ఉంటుంది. దూర ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. నిర్మాణాలలో అనుకూలత బాగుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థత ప్రదర్శిస్తారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా అనుమానాలు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. అనవసర విషయాలలో జోక్యం చేసుకోవద్దు. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి.

# అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

రాజ్యాంగనిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు నిరుపమానమైనవని, ఆయన సేవలు సదా చిరస్మరణీయాలేనని ఎస్వీయు గణితశాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎం.సుందరమూర్తి అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న విక్రమసింహపురి యూనివర్శిటీ కళాశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డా.అంబేద్కర్ భారతదేశంలో జన్మించడం అందరం గర్వించదగిన విషయమని, సమాజంలో అట్టడుగున పడివున్న నిమ్నవర్గాలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని ఆయన వివరించారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆ వేదిక రాష్ట్ర ప్రతినిధి కోడూరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.కేశవరామ్, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 20 నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ యోగా పోటీలు ఈ నెల 20 నుంచి 22వ తేది వరకు నిర్వహిస్తామని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎన్.విక్టర్ తెలిపారు. నెల్లూరులోని కెఎన్ఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగే ఈ పోటీల్లో అండర్-14, 17 బాలబాలికలు యోగా, జోడో జట్ల ఎంపికలు ఈ నెల 10వ తేదీన జరుగుతాయని, ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి వయసు ధృవీకరణ పత్రంతో సహా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

# స్వతంత్ర పార్కులో 'స్వచ్ఛభారత్'

నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతంలో వున్న స్వతంత్రపార్కులో ఈ నెల 6న బాలకృష్ణ అభిమాన సంఘాల గౌరవాధ్యక్షుడు వై.రవి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పార్కులో వున్న గాంధీజీ విగ్రహానికి రంగులు వేయించారు. పార్కులో చెత్తాచెదారాన్నంతా శుభ్రం చేసి, ఆ ప్రాంతాన్నంతా పరిశుభ్రంగా వుండేలా తీర్చిదిద్దారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో వుండే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ పట్ల సంబంధిత సిబ్బంది తగు శ్రద్ధ చూపాలని ఐటిడిఏ పి.ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ నెల 6న ఆయన నెల్లూరులోని ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థులకు ఎలాంటి జ్వరాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులకు వైద్యసౌకర్యాలు అందుబాటులో వుండేలా చూడాలన్నారు.

# సత్వర న్యాయం.. లోక్ అదాలత్ లక్ష్యం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు**



కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్‌అదాలత్ లక్ష్యమని, లోక్‌అదాలత్ అనేది నిరంతర ప్రక్రియ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్ భవనంలో ఈ నెల 6న రెండో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న కేసులను పరిష్కరించడంతోపాటు, ప్రజలకు న్యాయవ్యవస్థను చేరువ చేసే ఉద్దేశంతో లోక్‌అదాలత్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఎంతోమంది మేధావులు, న్యాయకోవిదులు కలసి లోక్ అదాలత్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సామాన్య ప్రజలకు సైతం న్యాయ సహాయం అందాలని, కోర్టుకు వచ్చినవారికి సకాలంలో న్యాయం అందించాలనే సదాశయంతో ఈ వ్యవస్థ ఏర్పాటైందన్నారు. ఇందులో పరిష్కరించిన కేసులకు తిరిగి ఫీజు చెల్లిస్తారని, లోక్ అదాలత్ ద్వారా వేసుకునే కేసులకు ఫీజు రాయితీలు వుంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటిదాకా న్యాయసేవాధికార సంస్థ ద్వారా 6072 కేసులు పరిష్కరించామని, 176 న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించామని, 260 కేసులకు సంబంధించి ఉచిత న్యాయసహాయం అందించామని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు ఖర్చు లేకుండా సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ రెడ్డి గంగాధర్, అదనపు జిల్లా జడ్జిలు జగదీష్‌చంద్రరావు, ఆనంద్, న్యాయసేవాధికారసంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అదనపు జిల్లా జడ్జిలు నరసింహరాజు, రామచంద్రమూర్తి, సీనియర్ సివిల్ జడ్జిలు ఎస్.రజని, భూపాల్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు, మెజిస్ట్రేట్‌లు హేమలత, ప్రత్యూష కుమారి, వెన్నెల, ప్రవీణ్‌కుమార్, శోభారాణి, పద్మిని, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కాగా, జిల్లావ్యాప్తంగా 6న నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 5,840 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 263 సివిల్, 2210 క్రిమినల్,3367 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం అయ్యాయి.

# చంద్రమౌళినగర్‌లో రక్తదాన శిబిరం



ఈ నెల 7న నెల్లూరు వేదాయపాలెంలోని చంద్రమౌళి నగర్ 9వ వీధిలో గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని 5వ పట్టణ సబ్ఇన్స్‌పెక్టర్ సోమయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకని, రక్తదానం చేసిన చంద్రమౌళినగర్ యువతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్, మోపూరు భాస్కర్ నాయుడు, డా॥ యస్.సాయినాథ్, బొట్టా భాస్కర్‌రావు, కె.ప్రభాకర్, రక్తదాతలు, రెడ్‌క్రాస్ రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!



ఆర్.కె. ఫామ్ ల్యాండ్స్ అధినేత వల్లపురెడ్డి రాధాకృష్ణారెడ్డి - అరుణల కుమార్తె **తేజస్విని - యశ్వంత్‌రెడ్డి** (బెంగుళూరులోని ప్రముఖ బిల్డర్ ముంగమూరు శివకుమార్‌రెడ్డి - షర్మిల ల కుమారుడు)ల కల్యాణం డిసెంబర్ 7వ తేదీ విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా జరిగింది. కొత్త జంటకు లాయర్' అభినందనలు.



ప్రముఖ ఆడిటర్ టి.వి.వసంతకుమార్‌రెడ్డి - పుష్పలతల కుమారుడు **డా॥ కేదార్‌నాథ్‌రెడ్డి - డా॥ దివ్యశ్రీ** (అనంతపురం వాస్తవ్యులు భూమిరెడ్డి చంద్రఓబుళ్‌రెడ్డి - గీతా గంధివాణిల కుమార్తెల వివాహం డిసెంబర్ 7వ తేదీ అనంతపురంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్లో, రిసెప్షన్ వేడుకలు 10వ తేదీన నెల్లూరు అనీల్ గార్డెన్స్‌లో వైభవంగా జరిగాయి. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరుకు చెందిన ప్రముఖ రియల్టర్ పోసిన రమేష్‌బాబు(రవి) - విజయలక్ష్మిల కుమార్తె **రేష్మా - ప్రతీష్** (నాగిశెట్టి ప్రసాద్ - భారతిల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 7వ తేదీ అనిల్‌గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



ప్రగతి డెవలపర్స్ అధినేత బాలు శ్రీనివాస్ - రాజ్యలక్ష్మిల కుమార్తె **ప్రియాంక - వెంకట దామోదర్** (మల్లెల వెంకటేశ్వర్లు - లీలల కుమారుడు)ల పరిణయం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని స్రీడ్స్ ఫంక్షన్ హాల్ నందు వైభవంగా జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# సీమాంధ్రకు సింగపూర్ సోకు!

(మొదటిపేజీ తరువాయి)

సింగపూర్ వ్యామోహమేంటో ఎవరికీ అర్థం కాదు. సింగపూర్ మన హైదరాబాద్‌లో సగం ఉండదు. వాళ్లకు స్థలం లేదు, వ్యవసాయభూములు లేవు. స్నానానికి వాడుకున్న నీటిని రీ సైక్లింగ్ చేసుకుని మంచినీళ్లకు వాడుకునే దుస్థితి. చుట్టూ సముద్రమే కావడంతో ఒక్క అంగుళం కూడా విస్తరించే పరిస్థితి లేదు. అంతస్థుల మీద అంతస్థులు కట్టుకోవాల్సిందే! వాళ్లకు భూమి లేదు కాబట్టి ఆకాశాన్ని తాకే భవనాలను కట్టుకుంటున్నారు. మనకు ఆ గతి పట్టలేదుగా! మన దేశంలో ఏ రాష్ట్ర రాజధాని కూడా మాస్టర్ ప్లాన్‌లు గీసి నిర్మించలేదు. వాటి పాటికవి అభివృద్ధి చెందాయి. రాజధాని నిర్మాణానికి విదేశీ కంపెనీల మాస్టర్‌ప్లాన్‌లు అవసరం లేదు. సింగపూర్‌లాగా మన రాష్ట్ర రాజధానిలో కూడా పచ్చటి పొలాలు లేకుండా చేయడానికే సింగపూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా వుంది.

# సోమిరెడ్డికి ఛాన్స్

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రుల హవానే నడుస్తుండడం వల్ల కూడా మిగతా మంత్రులు చొరవ చూపలేకపోతున్నారు. ఉన్న ముగ్గురు సీనియర్ మంత్రులు కూడా దీనిపై అసంతృప్తిగానే ఉన్నట్లు తెలుస్తుంది.

పరిపాలనా పరంగానే కాకుండా పార్టీపరంగా కూడా కొందరు కొత్తమంత్రుల వ్యవహారంతో నష్టం వాటిల్లుతుంది. మంత్రులు తమతమ జిల్లాలను తమ చేతుల్లోకి తెచ్చుకోవాలి, పార్టీ కేడర్‌నంతా ఒక తాటిమీదకు తేవాలి. ప్రభుత్వం, పార్టీ జోడెద్దుల బండి లాంటిది. ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటూ పోవాలి. ఇప్పుడున్న మంత్రులలో ఆ లౌక్యం లేకుండా పోయింది. కాబట్టి మరో మూడు నాలుగు నెలల్లో చంద్రబాబు మంత్రి వర్గాన్ని విస్తరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

మంత్రివర్గంలోనే కాదు, ప్రభుత్వంలో కూడా రెడ్లకు సరైన ప్రాతినిధ్యం లేకుండా పోయింది. తెలుగుదేశంలో రెడ్లను అణగదొక్కేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ చాపక్రింద నీరులా చొచ్చుకుపోసాగింది. ఈ క్రమంలో అసంతృప్తితో వున్న రెడ్లు బీజేపీ వైపు పోవాలనే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు చెవిన పడింది. ఈ రెడ్లను కూడా పార్టీలో నిలబెట్టుకోవాలని, అన్ని వర్గాలను సమన్వయం చేసుకుని పార్టీని గట్టిగా నిలబెట్టుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే ఈసారి మంత్రివర్గంలో మార్పులు చేపడితే నెల్లూరుజిల్లా నుండి రెండో మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి స్థానం కల్పించే అవకాశాలున్నాయి. సోమిరెడ్డి సీనియర్. ఏ సబ్జెక్ట్ పైనైనా చీల్చి చెండాడగలడు. రాజకీయంగానూ ప్రత్యర్థులను ఎదుర్కోగలడు. రాజకీయపరమైన అవసరాలరీత్యా కూడా సోమిరెడ్డిని కేబినెట్‌లోకి తీసుకోవాల్సిన అవసరముంది.

# మన నగరం... మహా మురికికూపం

(మొదటిపేజీ తరువాయి)

నగరంలోని అనేక ప్రధానమైన రోడ్లన్నీ మురుగుప్రవాహాలతో నిండిపోయాయి. మన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల వ్యవస్థ ఎంత ఘోరంగా అఘోరిస్తోందో మరోసారి తేటతెల్లమైంది.

జిల్లాలో అదునుకు వర్షాలు కురవక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న ఈ తరుణంలో, ఒక్కసారిగా వరుణుడు కరుణించాడు. మంగళవారం అర్ధరాత్రి నుంచి వాన కురవడం ప్రారంభించింది. బుధవారం రాత్రి దాకా ఒకటే వాన..జల్లులు జల్లులుగా కురుస్తూనే వుంది. జిల్లావ్యాప్తంగా 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు వంకలు జలకళను సంతరించుకోవడంతో రైతులు ఎంతో సంతోషించారు. అయితే, ఈ వర్షం రైతాంగానికి హర్షం తెచ్చినా, నగర వాసులకు మాత్రం కష్టాలనే తెచ్చింది. అసలే అస్తవ్యస్తంగా వున్న నగరం నెత్తిమీద కష్టాల జడివాన కురిసినట్లుగా అనిపించింది. వర్షాలు వస్తే నగరం ఎంత అధ్వాన్నంగా వుంటుందో మరోసారి కళ్ళకు కట్టినట్లయింది.

డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నగరంలో అనేకచోట్ల సైడుకాలువలు పొంగిపోయి, రోడ్లన్నీ మురుగు కాలువలుగా మారిపోయాయి. నిత్యం ఎంతో రద్దీగా వుండే మాగుంట లేఅవుట్ జలదిగ్బంధంలో కూరుకుపోయింది. మురుగునీటితో నిండిపోయి అండర్‌బ్రిడ్జి మురుగుగుంటగా మారింది. దీనికితోడు ఆ నీటిలో మూడు వాహనాలు చిక్కుకుపోయాయి. బ్రిడ్జి దాటి అటు ఇటు పోలేక, రాలేక జనం పడిన అవస్తలు, వాహనదారుల ఇబ్బందులు ఎన్నని చెప్పగలం?..అదేవిధంగా, ఆత్మకూరు బస్టాండ్ వద్ద వున్న అండర్‌బ్రిడ్జిల్లో నీరు నిలచిపోయి, వాహనాలు చిక్కుకుపోయి, ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రజలు ఎన్నెన్ని బాధలు పడ్డారో.. అయినా.. ఎవరి కష్టాలు వారివే తప్ప, పట్టించుకునేవారెవరు?..

నగరంలోని గొప్ప కూడళ్ళుగా పేరుమోసిన ట్రంక్‌రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్ సెంటర్, సంతపేట, మూలాపేట, రంగనాయకులపేట, రామ్మూర్తినగర్, బాలాజీనగర్, ఏసినగర్ సెంటర్లు తదితర ప్రధాన ప్రాంతాలు సైతం జలమయమైపోయాయి. ఎక్కడ చూసినా ముక్కులు అదిరిపోయే దుర్గంధం. డ్రైనేజీల్లోని నీళ్లన్నీ రోడ్లను ఆక్రమించేశాయి. మోకాళ్ళలోతు మురుగునీళ్ళలోనే జనం నడవాల్సి వచ్చింది. వీధుల్లోనూ, అంగళ్ళ వద్దా, ఇళ్ళు వాకిళ్ళ వద్దా అంతా భరాయించలేని మురుగు కంపే. ఇక శివారుప్రాంతాలన్నీ జలమయమైపోయాయి. ఇళ్ళలోకి కూడా నీళ్ళు వచ్చి పేదప్రజలు నానా అవస్తలు పడ్డారు. పాఠశాలలకి సెలవులు ప్రకటించడంతో చిన్నారులకు ఎలాగో అవస్తలు తప్పాయి అయినా, ఈ పరిస్థితి ఈనాటిది కాదు..ఎన్నో ఏళ్ళ నుంచీ వస్తున్నదే. వర్షం వచ్చినప్పుడల్లా పెరిగిపోతున్న మురుగుభయంతో ప్రజలు అల్లాడుతున్నదే. ఈ పరిస్థితులను అప్పుడప్పుడూ గుర్తుచేసి, ఇకనైనా బాగు చేసుకుంటారనే ఉద్దేశంతో కాబోలు..నగరం అవకాశం వచ్చినప్పుడల్లా తన విశ్వరూపం చూపుతూనే వుంది.

ఓ!..నా నగర ప్రజలారా!..ఈ దుస్థితిని ఇంకా ఎన్నాళ్ళు..ఎన్నేళ్ళు భరిస్తారు?..ఈ మురుగులో ఎన్నాళ్ళని అవస్తలు పడతారు?..ఈ అస్తవ్యస్త రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసుకోలేరా?..అని ఆవేదనగా ప్రశ్నిస్తూనే వుంటుంది. అధికారులు, పాలకులు మాత్రం ఆ సమయానికి వస్తారు. ఏదో నామమాత్రపు చర్యలు చేపడతారు. మళ్ళీ ఎండ వచ్చిందంటే చాలు..ఇక.అంతా మామూలే. రోడ్లమీదికి చేరిన ఆ మురుగంతా ఎండకు ఎండిపోవాల్సిందే.. అదే దుమ్మై.. ధూళై పోవాల్సిందే..దానికదే గాలిలో కలిసిపోవాల్సిందే తప్ప, మరో మార్గాంతరం లేదు. నగర దౌర్భాగ్యానికి, దయనీయస్థితికి ఇంతకన్నా ఇంకా ఏమి నిదర్శనాలు కావాలి?.. ఇప్పుడున్న పరిస్థితిని చక్కదిద్దాలంటే మరెన్నో వ్యయప్రయాసలు తప్పవు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, రోడ్లు భవనాలశాఖ అధికారులు, ప్రజారోగ్యశాఖ, నగరపాలక సంస్థ అధికారులు, విద్యుత్, ఇంజనీరంగ్ తదితర అధికారులంతా సమన్వయంగా కలసి, నగరం పడుతున్న ఈ నరకయాతనల నుంచి ప్రజలను కాపాడేందుకు చిత్తశుద్ధితో ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలి. డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్ది, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. అస్తవ్యస్తంగా వున్న రోడ్లను సరిచేయాలి. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ పటిష్టంగా తీసుకోవాలి. లేకుంటే, మళ్ళీమళ్ళీ నగర ప్రజలకు ఈ మురికి యాతనలు తప్పవు.

# జేబు పాలనకన్నా.. బాబు పాలన మిన్న!

శ్రీను గల్పిక

అది హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు సిమెంట్, ఇసుక బదులు తన రక్తాన్ని, చెమటను మిక్స్ చేసి కట్టించిన హైటెక్‌సిటీ ఉన్న భాగ్యనగరం. ఆ నగరంలో చంద్రబాబు నివాసం. ఆయన ఒక సోఫాలో కూర్చునివున్నారు. ఆయనకెదురుగా మంత్రులు కె.ఇ.కృష్ణమూర్తి, యనమల రామ కృష్ణుడు, పత్తిపాటి పుల్లారావు, పరిటాల సునీత, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, పల్లె రఘునాథరెడ్డి, రావెళ్ల కిషోర్‌బాబు వంటి నాయకులున్నారు. అప్పుడే సిఎస్ కృష్ణారావు వచ్చాడు. చంద్రబాబు వుండి.. ఏం సిఎస్ గారు... ఋణమాఫీ అర్హుల జాబితా రెడీ అయ్యిందా? ఋణమాఫీ అర్హులను ఏ విధంగా ఎంపిక చేసారని అడిగాడు. సీఎస్ స్పందిస్తూ... సార్, జాబితా అంతా రెడీ అయ్యింది. రకరకాల వడపోతల తర్వాత ఏడు కిలోమీటర్ల పొడవున్న ఋణమాఫీ లబ్ధిదారులను ఏడు సెంటీమీటర్లకు తెంచాము. లబ్ధిదారులను కుదించడానికి చాలా కసరత్తే చేయాల్సివచ్చింది. డ్వాక్రా ఋణాలు, బంగారు ఋణాలను జాబితా నుండి తొలగించాం. ఇక రైతుల ఋణాల జాబితాకి బాగా కత్తెరేసాం. లబ్ధిదారులకు కార్లు, బైక్‌లు, ఇళ్లు ఉండకూడదనే నిబంధన పెట్టాం. అంతేనా... ఒకరికిమించి పిల్లలుండకూడదని చెప్పాం... ఋణం కూడా 50వేలకు మించి ఉండకూడదనే కండీషన్ పెట్టాం. ఇన్ని కండీషన్స్ పెడితే ఈ మాత్రం జాబితా తయారయ్యిందంటూ నాలుగు పేపర్లు ఆయనకిచ్చాడు. శెభాష్ సిఎస్ గారు అంటూ చంద్రబాబు టీవీ 10.5-9 ఛానెల్‌లో వస్తున్న వార్తలు చూడసాగాడు. అప్పుడే ఋణమాఫీపై చంద్రబాబు మాట తప్పారంటూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాలు గురించి వార్తలు రాసాగాయి. వాటిని చూసి చంద్రబాబు తలపట్టుకున్నాడు. ఎంత చేసినా వీళ్లింతేనా సీఎస్ గారు అంటూ 'బూమ్‌బూచి' ఛానెల్ పెట్టాడు. అప్పుడు అక్కడకు సింహపురి చాణక్య సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా వచ్చి వారి పక్కనే కూర్చుని వార్తలు చూడసాగాడు. ఆ ఛానెల్‌లో... రాజధానికి మా భూములు ఇచ్చేది లేదంటూ తుళ్లూరు రైతులు చేస్తున్న ఆందోళన దృశ్యాలు రాసాగాయి. అవి చూసి చంద్రబాబు... రాత రాజ్యమేలమంటే... బుద్ధి భూమి దున్నమన్నట్లుగా వుంది వీరి వ్యవహారం. ఇక్కడ రాజధాని పెడితే వీళ్లకు మట్టి పిసుక్కునే పని తప్పి హాయిగా ఏసి రూమ్‌లలో రెస్ట్ తీసుకుంటారనుకుంటే, వీళ్లు మాత్రం ఆ మట్టే పిసుక్కుంటామంటున్నారు. ఖర్మ... ఎవరి రాతలు ఎవరు మార్చగలరు అని విసుక్కుంటూ 'ధాంధాం' ఛానెల్ పెట్టాడు. దాంట్లో చూస్తే కొండపల్లి కోటేశ్వరరావు చర్చావేదిక పెట్టి ఉన్నారు. అంబటి రాంబాబు, బి.వి.రాఘవులు, చికెన్ నారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర కూర్చుని వున్నారు. చంద్రబాబు ఆరు నెలల పాలనపై చర్చ మొదలుపెట్టారు. చంద్రబాబు రూపాయి పని చేయలేదని, రాష్ట్రాన్ని సింగపూర్‌కు అమ్మేయాలని చూస్తున్నాడని, ప్రజలపై పన్నులు బాదుతున్నాడని, ఋణమాఫీ పై మాట తప్పాడని, చంద్రబాబు పాలనకన్నా ఔరంగజేబు పాలనే మేలని అంబటి రాంబాబు, రాఘవులు, నారాయణ ఘాటుగా విమర్శించారు. అది చూసి చంద్రబాబుకు బాధేసింది. చూడండి, రాష్ట్రం కోసం నేనింత తపనపడుతున్నా వీళ్లు నన్ను ఆడి పోసుకుంటున్నారు. పోయిపోయి ఆ ఔరంగజేబుతో నా పాలన ముడిపెడుతున్నారు. నా పాలన బాగుంది అనిపించాలంటే ఏం చేయాలి? అని చంద్రబాబు ప్రశ్నించాడు. అప్పుడు సోమిరెడ్డి లేచి... సార్, ఒక గీతను చిన్నదిగా చూపాలంటే దాని పక్కన ఇంకో పెద్దగీత గీయాలన్నాడు. దానికీ వాళ్లు చేసిన విమర్శలకు లింకేంటని చంద్రబాబు అడిగాడు. దానికి సోమిరెడ్డి.. మీరు నా పాయింట్‌ను పూర్తిగా క్యాచ్ చేయలేకపోతున్నారు. సరే... స్టోరీలాగా చెబుతాను వినండి అంటూ మొదలుపెట్టాడు. పూర్వం మా తాలూకాలోని చిన్నచెరుకూరు గ్రామంలో పెంటయ్య అనే వాడుండేవాడు. ఆ గ్రామంలో జనమంతా మంచినీటికి వాడుకునే చెరువులో ఈ పెంటయ్య రోజూ మూత్రవిసర్జన చేసేవాడు. అందరూ వాడిని తిట్టుకునేవాళ్లు. కొద్దికాలానికి ఆ పెంటయ్య మంచాన పడ్డాడు. చచ్చేముందు తన కొడుకు శుంఠయ్యను పిలిచి... నాయనా, నాకు ఈ ఊరులో చాలా చెడ్డ పేరుంది. ఆ పేరును పోగొట్టి నన్ను మంచి అనిపించేలా చెయ్యమని కోరాడు. అలాగేనని శుంఠయ్య తన తండ్రికి వాగ్దానం చేసాడు. పెంటయ్య మరణించాక శుంఠయ్య ఆ ఊరి చెరువులో మలవిసర్జన చేయసాగాడు. అది చూసి జనం ఈ శుంఠడి కంటే వీడి నాయన పెంటోడే మంచోడురా... అనసాగారు... అని చెప్పి సోమిరెడ్డి ముగించాడు.

అది విన్న చంద్రబాబు కథ బాగానేవుంది. ఈ కథకు నా పాలనకు లింకేంటి... అని అడిగాడు. వెంటనే సోమిరెడ్డి... మన పాలన బాగుందనిపించాలంటే ఇంకో రాజ్యంలో వున్న నికృష్టపు పాలనను ప్రజలకు చూపించాలని చెబుతుండగా అప్పుడే అక్కడకు యువరత్న బాలకృష్ణ వచ్చాడు. ఆయనను చూడగానే సోమిరెడ్డి మెదడులో విజ్ఞానపు బల్బులు 108అంబులెన్స్ బల్బులు మాదిరిగా సౌండ్ చేస్తూ వెలగసాగాయి. వెంటనే సోమిరెడ్డి... సార్, నాకు బాలయ్యను చూడగానే బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది. గతంలో ఆయన హీరోగా నటించిన సైన్స్‌ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ ఆదిత్య369 సినిమా గుర్తుకొచ్చింది. ముల్లును ముల్లుతోనే తీయాలి. మీ పాలనను ఔరంగజేబుతో పోల్చిన వారికి ఆ రూటులోనే సమాధానం చెప్పాలంటూ చంద్రబాబు చెవిలో రహస్యంగా ఇంకేదో చెప్పాడు. దాంతో చంద్రబాబు ముఖం వెలిగిపోయింది.

★★★★★

అది సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్. ఆ గ్రౌండ్ మధ్యలో 'ఆదిత్య369' సినిమాలో ఉన్న టైంమిషన్ వుంది. సోమిరెడ్డి చంద్రబాబు చెవిలో చెప్పిన సీక్రెట్ టైంమిషన్ గురించే! ఇస్రో శాస్త్రవేత్తల సహకారంతో తయారుచేసిన ఈ టైంమిషన్‌కు 'చంద్రయాన్-2020' అని పేరుపెట్టారు. వైకాపా నుండి అంబటి రాంబాబు, కాంగ్రెస్ నుండి రఘువీరారెడ్డి, సీపీఎం నుండి బి.వి.రాఘవులు, సిపిఐ నారాయణ, బీజేపీ నుండి హరిబాబులతో పాటు మంత్రులు పి.నారాయణ, దేవినేని నెహ్రూ, లీడర్ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇంకా తుళ్లూరు రైతులు, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న పలువురు ఆందోళనకారులను కూడా ఆ మిషన్‌లోకి ఎక్కించారు. షార్ డైరెక్టర్ ఎం.వై.యస్.ప్రసాద్ ఈ మిషన్‌లోకి ఎక్కి ఔరంగజేబు పాలనాకాలమైన 1600-1700 సంవత్సరాలను అందులో కోడ్ చేసి బటన్ నొక్కాడు. అంతే మిషన్ గిర్రున తిరిగి వేగంగా పైకి లేచింది. అలా వెళ్లి 1600 సంవత్సరం కాలంలోకి దిగింది.

★★★★★

అది ఔరంగజేబు రాజ్యం. ఎక్కడ చూసినా ఔరంగజేబు సైనికులే కనిపిస్తున్నారు. టైంమిషన్ నుండి బయటకొచ్చిన ఏపి నాయకులు, రైతులు మెల్లమెల్లగా ఆ రాజ్యంలోని ప్రధాననగరంలో నడుస్తున్నారు. అంతలో సైనికుడు వీరి వద్దకొచ్చి... ఏయ్.. మా రాజ్యంలో చెప్పులేసుకుని నడుస్తారా, చెప్పులకు పన్ను కట్టండంటూ వీళ్ల వద్ద డబ్బంతా లాక్కుపోయాడు. కొద్దిదూరం నడిచాక కొందరిని పదిమంది సైనికులు కొరడాలతో కొడుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. బి.వి.రాఘవులు అక్కడవున్న ఓ పౌరుడిని పిలిచి.. వారిని ఎందుకు కొడుతున్నారని అడిగాడు. అందుకా వ్యక్తి... వాళ్లు జుట్టు పెంచుకున్నారు, అందుకే ఆ శిక్ష అని చెప్పాడు. తమలో కూడా అందరికీ జుట్టు పెరిగి ఉండడంతో వీళ్లు ఇంకో వీధిలో పోసాగారు. అక్కడ చూస్తే అందరూ గుండ్లు చేసుకుని ఉన్నారు. సైనికులు వాళ్ల నుండి పన్నులు వసూలు చేస్తున్నారు. అంబటి రాంబాబు అక్కడే వున్న ఓ వ్యక్తితో... వీళ్ల నుండి పన్నులెందుకు కట్టించుకుంటున్నారని అడిగాడు. అందుకు అతను వీళ్లంతా జుట్టు లేకుండా గుండ్లు గీయించుకున్నారు, అందుకే పన్నులు వసూలు చేస్తున్నారని చెప్పాడు. అప్పుడే అటుగా ఎద్దులు తోలుకుని వస్తున్న ఓ రైతును సిపిఐ నారాయణ ఆపాడు. ఏం బాబు, మీ రాజ్యంలో ఋణమాఫీ వంటివి ఉన్నాయా అని అడిగాడు. దానికి ఆ రైతు... ఋణమాఫీయా.. మేం పండించిన పంటలో ముప్పావు భాగం రాజు గారికివ్వాలి, మాకు మిగిలేది రెక్కలకష్టమే అని అన్నాడు. అంతలో అక్కడకు ఓ ముసలావిడ ఊతకర్ర సాయంతో వచ్చి... నాయనా, ఈ రాజ్యానికి మీరు కొత్తవారులా వున్నారు. మీకీ విషయం తెలియదా అని అడిగింది. ఏ విషయం అవ్వా అని పి.నారాయణ ఆతృతగా అడిగాడు. ఈ రాజ్యంలో మగవాళ్లు గడ్డం పెంచుకోకున్నా పన్ను వేస్తారు. మీలో చూస్తే ఈ బాబు(సోమిరెడ్డి)కు తప్ప ఎవరికీ గడ్డం లేదు. గడ్డం లేకుంటే జరిమానా, నూరు కొరడా దెబ్బలు తప్పవు. మా సైనికుల కంట పడకముందే ఈ రాజ్యం వదిలిపోండి అని చెప్పింది. ఆ మాట వినడంతోనే అందరూ ఈ ఔరంగజేబు కంటే మా చంద్రబాబే బెటర్ అంటూ టైంమిషన్ వద్దకు పరుగులంకించారు.

★★★★★

## కదంబం

### దూరాలన్నీ...

- బాలసుధాకర్ మౌళి

పోరం, విజయనగరం జిల్లా. 9676493680

దూరంగా వున్నామన్న మాటే గానీ
ఎవరూ దూరమైపోరు
దగ్గరలోనే
రెండడుగులు వేస్తే అందే దూరంలోనే
చేతిలో ఏదో వొకటి పట్టుకుని
మన కోసం ఎదురుచూస్తుంటారు
మనమూ వాళ్ల కోసం
కళ్లల్లో దీపాల్ని వెలిగించుకుని
మరీ ఆభగా ఎదురుచూస్తుంటాం
యిలా అనుకున్నదంతా
ఊహే కావొచ్చు
నల్లబల్ల మీద రాసిన నాలుగు వరుసల అక్షరాలని
మామూలుగానే
డస్టర్‌తో చెరిపేసినట్టు ఆ వొక్క వూహే
దూరాల్నీ చెరిపేస్తుంది
దూరాలని అనుకుంటాం గానీ
మరీ దూరాలేం కావు
అస్సలు అందనంత దూరాలూ కావు
దూరాలన్నీ కాసింత దూరంలోనే -

కళ్లముందు యిలా వాలిన పిట్ట
అలా ఎగిరిపోతుంది
ఏదీ అనుభవంలోకి రాని వొక స్థితి నిత్యం
వెంటాడుతుంది
గాయపరుస్తుంది
ఎప్పటివో
జ్ఞాపకాలన్నీ
నీటి తరంగాల్లా వొకదాని వెనుక వొకటి
సుడులు తిరుగుతుంటాయి
అడ్డొచ్చిన వొక్కో కంచెను తీసి అవతల పడేసినట్టుగా
దూరాలన్నీ వొక్కొక్కటిగా చెరిగిపోతుంటాయి

వొడ్డులాగే
మనమూ మామూలుగా అతి సహజంగా
ఏదీ ఏ కదలికా జరగనట్టే
వొక శిలాకృతిలోకి
వొక జ్ఞాపకంలోకి వొదిగిపోతాం

జ్ఞాపకాలన్నీ ఖాళీ అయిపోతాయి
అలసటొస్తుంది
ఏ రాత్రో, ఏ ఎండ కాసిన పగటి పూటో
గాఢమైన నిద్రలోకి వెళ్లిపోతాం
నిద్రలోనూ
అవే జ్ఞాపకాలు తుమ్మెదలై
కళ్ల రెప్పల మీద వచ్చి కూర్చుంటాయి
జోలపాడుతాయి

దూరం అని అనుకుంటాం గానీ
ఏవీ దూరం కావు -
మరీ దగ్గరిగా కూడా ఏవీ లేవు
దూరాలన్నీ దగ్గరవుతాయనే
వొక నమ్మకం మాత్రం మిగిలి వుంటుంది -

## రక్తదానంపై వ్యాసరచన పోటీలు

నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన సందర్భంగా జిల్లాలోని మోటివేటర్లకు, రక్తదాతలకు రెడ్‌క్రాస్ రక్తనిధిలో ఈ నెల 27వ తేదీ నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరుగుతుందని కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన, డిగ్రీ విద్యార్థులకు కవితలు సాహితీ మిత్రులకు కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానమే ప్రాణదానం అనే అంశంపై రచనలు ఈ నెల 20లోగా పంపాలన్నారు. అన్ని విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా సన్మానం జరుగుతుందన్నారు. రచనలను కన్వీనర్, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్, కూరగాయల మార్కెట్ పక్కన, నెల్లూరు వారికి పంపాలని, వివరాలకు 9347109266 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

నెల్లూరు వేదాయపాళెంలో వున్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో జరుగుతున్న మండలపూజా మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 6న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీ అయ్యప్పసేవా సమితి అధ్యక్షులు పి.టి రంగరాజన్, కార్యదర్శి జి.శేషగిరిరావుల ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకం, పూలంగిసేవ జరిగాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

## నెల్లూరీయులకు ఎక్స్‌రే అవార్డులు

నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు కవులు విజయవాడకు చెందిన ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సంస్థ అందజేసే రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. కోటకు చెందిన కవి సుంకర గోపాల్ రచించిన 'ఒక నక్షత్రం-ఒక నెలవంక' కవిత ఎక్స్‌రే అవార్డుతో పాటు, రూ. 10వేల నగదు పురస్కారం కూడా అందుకోనున్నారు. అదేవిధంగా నెల్లూరుకు చెందిన కవులు గుర్రాల రమణయ్య, ఈతకోట సుబ్బారావు, కోవూరుకు చెందిన కె.వి నాగేశ్వరరావు కవితలు కూడా ఉత్తమ కవితలుగా ఎంపికయ్యాయి. ఈ నెల 25వ తేదీన విజయవాడలో జరిగే కార్యక్రమంలో వీరందరికీ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

# Telugu Association of North America





తానా 20వ ద్వైవార్షిక సదస్సును పురస్కరించుకుని

నెల్లూరీయుల ముంగిళ్ళలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలు వేదికగా నిర్వహించే

## "చైతన్య స్రవంతి"

మహోత్సవానికి అందరికీ ఇదే మా





## ఆహ్వానము





**డిసెంబర్ 18వ తేదీ** గురువారం

ఉదయం 9.00గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు

నెల్లూరు, **శ్రీ కస్తూరిదేవి గార్డెన్స్** వేదికగా జరిగే ఈ వేడుకలో

**ఉదయం 9.00 గంటలకు ప్రారంభోత్సవ సభ,**

ఉదయం 10.00గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు

తెలుగు సంస్కృతి, సంప్రదాయం, సాహిత్యంతో పాటు

ప్రాచీన కళలు, కళా ప్రదర్శనలు తదితర అంశాలతో కూడిన

**"కళావైభవం"**తో పాటు కనులవిందు చేసే నృత్యాలు

వీనులవిందు చేసే పాటలు అందరినీ అలరిస్తాయి.





సాయంత్రం 6గంటల నుండి రాత్రి 9గంటల వరకు జరిగే కార్యక్రమంలో

**ముగింపు సభ**తో పాటు తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన

పలువురు సినీ ప్రముఖులు, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన

స్థానిక కళాకారులు తమ ఆటపాటలతో మురిపిస్తారు.





ఈ సందర్భంగా "గిడుగు రామమూర్తి అవార్డు" బహుకరణతో సహా

పలు సేవా కార్యక్రమాలకు ఈ సంబరం వేదిక కాబోతోంది.


అనేకమంది తానా సభ్యులు, పలువురు పారిశ్రామిక ముఖ్యులు,

వివిధ రాజకీయపార్టీల ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు పాల్గొననున్న

ఈ సంప్రదాయ వేడుకలో ప్రతిఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం

చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.





## అందరూ ఆహ్వానితులే...

ఇట్లు

**కార్యనిర్వాహక కమిటి**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com